విలేకరులు కావలెను

చట్టం మీ చుట్టం
జాతీయ తెలుగు దిన పత్రిక

ప్రతి క్షణం ప్రజల పక్షం నిలబడే చట్టం మీ చుట్టం దినపత్రికకు ఆంధ్రప్రదేశ్ మరియు తెలంగాణ రాష్ట్రాలలోని అన్ని జిల్లాల వ్యాప్తంగా విలేకరులు కావలెను.

సంప్రదించవలసిన ఫోన్ నెంబర్

9581419999

# చట్టం మీ చుట్టం

జాతీయ తెలుగు దిన పత్రిక

సంపుటి : 14 ● సంచిక : 43 Simultaneously Published from Kurnool AP &TS, Bengaluru, Mumbai, Chennai, Kerala, Patna, Kolkata & Delhi మంగళవారం 24 ఫిబ్రవరి 2026 ● పేజీలు : 8 ● వెల 2/-

## నేపాల్లో లోయలో పడ్డ బస్సు: 18మంది మృతి

**ఖాట్మండ్,ఫిబ్రవరి23 (చట్టం న్యూస్):** నేపాల్‌లో ఘోర ప్రమాదం చోటుచేసుకుంది. ధాడింగ్ జిల్లాలో ఓ ప్రయాణికుల బస్సు లోయలో పడి 18 మంది మృతిచెందారు. మరో 28 మంది గాయపడ్డారు. పొఖారా నుంచి కార్‌మాండూ వెళ్తుండగా సోమవారం తెల్లవారుజామున ఈ దుర్ఘటన జరిగింది. బస్సు అదుపుతప్పి త్రిశూలీ నదిలోకి దూసుకెళ్లింది. ప్రమాద సమయంలో బస్సులో 45 మందికి పైగా ప్రయాణికులున్నారు. సమాచారం అందుకున్న పోలీసులు, రెస్క్యూ సిబ్బంది ఘటనాస్థలానికి చేరుకుని సహాయక చర్యలు చేపట్టారు. క్షతగాత్రులను ఆసుపత్రికి తరలించారు. మృతుల్లో విదేశీయులు కూడా ఉన్నట్లు తెలుస్తోంది. ప్రమాదానికి కారణాలు ఇంకా తెలియరాలేదు. అయితే, అతివేగం వల్లే ఈ ఘటన జరిగి ఉండొచ్చని పోలీసులు అనుమానిస్తున్నారు.

## దిగుమతులపై సుంకాల విధింపు నిలిపివేత

- సుప్రీం తీర్పుతో దారికొచ్చిన ప్రభుత్వం
- మంగళవారం నుంచి నిలిపివేస్తున్నట్లు వెల్లడి
- అమెరికా కస్టమ్స్ శాఖ ప్రకటన విడుదల



**వాషింగ్టన్,ఫిబ్రవరి23 (చట్టం న్యూస్):** దిగుమతులపై సుంకాల విధింపును మంగళవారం నుంచీ నిలిపి వేయనున్నామని అమెరికా కస్టమ్స్ శాఖ తాజాగా ఒక ప్రకటనలో తెలిపింది. ఆర్థిక ఎమర్జెన్సీ పేరిట ట్రంప్ ప్రభుత్వం విధిస్తున్న సుంకాలు చెల్లవంటూ అమెరికా సుప్రీం కోర్టు ఇటీవల తీర్పునిచ్చిన నేపథ్యంలో యూఎస్ కస్టమ్స్ అండ్ బోర్డర్స్ ప్రొటెక్షన్ శాఖ ఈ ప్రకటన విడుదల చేసింది. ఇంటర్నేషనల్ ఎమర్జెన్సీ ఎకనమిక్ పవర్స్ చట్టం కింద సుంకాల వసూళ్లను నిలిపివేస్తున్నట్టు తెలిపింది. అమెరికా కాలమానం ప్రకారం, మంగళవారం అర్ధరాత్రి 12.01 నుంచి ఇది అమల్లోకి వస్తుందని పేర్కొంది.సుప్రీం కోర్టు తీర్పు వెలువడిన మూడు రోజులకు కస్టమ్స్ శాఖ ఈ ప్రకటన విడుదల చేసింది. వెంటనే సుంకాల వసూలును ఎందుకు నిలిపివేయలేదో చెప్పలేదు. ఇప్పటివరకూ వసూలు చేసిన సుంకాల డబ్బును రీఫండ్ చేయడంపై కూడా క్లారిటీ ఇవ్వలేదు. అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ దిగుమతులపై కొత్తగా 10 శాతం కనీస సుంకాన్ని ప్రకటించిన విషయం తెలిసిందే. తాజాగా దాన్ని 15

మిగతా 2వ పేజీలో..

## ఎపిలో ప్రారంభమైన ఇంటర్ పరీక్షలు

- పకడ్బందీగా ఏర్పాట్లు చేసిన అధికారులు
- గంటముందే కేంద్రాలకు చేరుకున్న విద్యార్థులు



**అమరావతి,ఫిబ్రవరి23 (చట్టం న్యూస్):** రాష్ట్ర వ్యాప్తంగా ఇంటర్మీడియట్ పరీక్షలు ప్రారంభమయ్యాయి. సోమవారం ఉదయం 9:00 గంటలకు ఈ పరీక్షలు ప్రారంభమయ్యాయి. పరీక్ష సమయానికి ఒక్క నిమిషం ఆలస్యమైనా

మిగతా 2వ పేజీలో..

## తెలంగాణ టిజి ఎడ్‌సెట్ నోటిఫజకేషన్ విడుదల


- 23నుంచి ఎప్రిల్ 15 వరకు దరఖాస్తులకు అవకాశం
- మే 12న తెలంగాణ వ్యాప్తంగా టీజీ ఎడ్‌సెట్ ప్రవేశ పరీక్ష

**హైదరాబాద్,ఫిబ్రవరి23 (చట్టం న్యూస్):** తెలంగాణ రాష్ట్రంలోని బీఈడీ కళాశాలల్లో ప్రవేశాల కోసం నిర్వహించే ప్రతిష్టాత్మక టిజి ఎడ్‌సెట్–2026 నోటిఫికేషన్‌ను వరంగల్‌లోని కాకతీయ యూనివర్సిటీ అధికారులు విడుదల చేశారు. ఈ ఏడాది పరీక్ష నిర్వహణ బాధ్యతలను స్వీకరించిన కేయూ, దరఖాస్తుల ప్రక్రియ నుంచి ఫలితాల విడుదల వరకు పూర్తి షెడ్యూల్‌ను ఖరారు చేసింది. దీని ప్రకారం ఫిబ్రవరి 23వ తేదీ నుండి ఆన్‌లైన్‌లో దరఖాస్తుల

మిగతా 2వ పేజీలో..

# వికసిత బెంగాల్ బాధ్యత నాది

- ఆందోళన కలిగించేలా బెంగాల్లో చొరబాట్లు
- బంగారు బంగ్లా కలలు సాకారం చేసుకుందాం
- బెంగాల్ ప్రజలకు ప్రధాని మోడీ బహిరంగ లేఖ



**న్యూఢిల్లీ,ఫిబ్రవరి23 (చట్టం న్యూస్):** పశ్చిమబెంగాల్ అసెంబ్లీ ఎన్నికలు త్వరలో జరుగనున్న వేళ ప్రధాన మంత్రి నరేంద్ర మోదీ బెంగాల్ ప్రజలకు బహిరంగ లేఖ రాశారు. రాష్ట్రంలోని ప్రస్తుత పరిస్థితిపై ఆయన ఆవేదన వ్యక్తం చేశారు. మరి కొద్ది నెలరోజుల్లో బెంగాల్ భవితను నిర్ణయించే కీలక ఎన్నికలు జరుగ నున్నాయని, భావితరాల భవిష్యత్తును నిర్ణయించే ఈ ఎన్నికల్లో ప్రజలు వివేకవంతమైన నిర్ణయం తీసుకోవాలని కోరారు. బంగారు బంగ్లా కలల సాకారానికి తాను భరోసా ఇస్తున్నానని అన్నారు. జై మహాకాళి' అంటూ ప్రధాని తన లేఖను ప్రారంభించారు. 'మరి కొద్ది నెలల్లోనే బెంగాల్ భవిష్యత్తు నిర్ణయం కోబోతోంది. మీరు తీసుకునే తెలివైన నిర్ణయం పైనే భావితరాల భవిష్యత్తు, దిశానిర్దేశర ఆధారపడి ఉంటుంది. సోనార్ బంగ్లా కోసం యువకులు, పెద్దలు, మహిళలు కన్న కలలు కల్లలుగా మిగిలిపోతున్న పరిస్థితి ఇవాళ ఉంది. వారి బాధలు నన్ను కలిచివేస్తున్నాయి. ఇందుకోసం హృదయపూర్వకంగా ఒక తీర్మానం చేసుకున్నాను. వికసత్ బంగ్లా సాధనకు నిర్ణయం తీసుకున్నాను' అని ఆ లేఖలో మోదీ పేర్కొన్నారు. గత 11 ఏళ్లుగా దేశ ప్రజల ఆశీస్సుల బలంతో ప్రజాసంక్షేమానికి, దేశ సర్వతోముఖాభివృద్ధికి ఎన్డీయే ప్రభుత్వం పాటుపడిందని, రైతుల సంక్షేమం నుంచి యవత కలల సాకారం, మహిళా సాధికారత వరకూ కృషి చేసిందని చెప్పారు. ప్రభుత్వ విధానాల వల్ల సాధించిన సానుకూల ఫలితాలను ఇవాళ ప్రజలు చూస్తున్నారని అన్నారు. బెంగాల్ అభివృద్ధి విషయంలో మమతాబెనర్జీ ప్రభుత్వం సహాయ నిరాకరణ చేస్తోందని మోదీ ఆ లేఖలో విమర్శించారు. అయినప్పటికీ ప్రజాసంక్షేమానికి కట్టుబడి కేంద్రం ముందుకు వెళ్తోందన్నారు. 'జన్–ధన్ యోజన'తో పశ్చిమబెంగాల్‌లోని సుమారు 5 లక్షల మందికి బ్యాంకు అకౌంట్లు తెరిచామని,

మిగతా 2వ పేజీలో..

## పాలకల్తీ మరణాలపై చంద్రబాబు ఆరా

### అధికారులతో సమీక్షించి తక్షణ చర్యలకు ఆదేశం



అమరావతి,ఫిబ్రవరి23 (చట్టం న్యూస్): రాజమహేంద్రవరంలోని చౌడేశ్వరి నగర్, స్వరూప్ నగర్‌లో స్థానికుల అస్వస్థత, మరణాలపై సీఎం చంద్రబాబు ఆరా తీసారు. పాలకల్తీ వ్యవహారంపై అధికారులతో సమీక్ష నిర్వహించారు. జిల్లా కలెక్టర్, ఎస్పీ, వైద్యారోగ్యశాఖ, ఫుడ్ సేఫ్టీ అధికారులతో వర్చువల్‌గా

మిగతా 2వ పేజీలో..

## సత్ప్రవర్తన ఖైదీలకు క్షమాభిక్ష

- ప్రభుత్వం సానుకూలంగా ఉందన్న హోంమంత్రి
- జైళ్లు, సంస్కరణల చట్టం సవరణపై బిల్లుపై అనిత

**అమరావతి,ఫిబ్రవరి23 (చట్టం న్యూస్):** జైలులోని ఖైదీలకు క్షమాభిక్ష విషయంలో కూటమి ప్రభుత్వం సానుకూలంగా ఉందని రాష్ట్ర హోంశాఖ మంత్రి వంగలపూడి అనిత స్పష్టం చేశారు. సోమవారం అసెంబ్లీ బడ్జెట్ సమావేశాల్లో ఆమె మాట్లాడారు. జైళ్లు, సంస్కరణల చట్టం సవరణపై బిల్లును అసెంబ్లీలో హోంమంత్రి అనిత ప్రవేశపెట్టారు. ఈ సందర్భంగా హోం మంత్రి అనిత మాట్లాడుతూ.. ఖైదీల సంస్కరణల కోసం ప్రభుత్వం చర్యలు చేపట్టిందన్నారు. కేంద్రం తెచ్చిన చట్టం మేరకు ఇక్కడ కూడా సంస్కరణలు అమలు చేస్తున్నామన్నారు. ఖైదీలు జైలులో ఉండి చదువుకునేలా అవకాశాలను మెరుగుపరుస్తున్నామని చెప్పారు. ఖైదీల్లో పరివర్తన తీసుకురావటం కోసం చట్టంలో మార్పులు తీసుకు రావాల్సిన అవసరం ఉందన్నారు.



మహిళా ఖైదీల పిల్లల కోసం జైలులో ప్రత్యేకంగా అంగన్‌వాడీ కేంద్రాలు ఏర్పాటు చేస్తున్నట్లు వివరించారు. ఖైదీల నేరచరిత్ర, ప్రవర్తన ఆధారంగా

మిగతా 2వ పేజీలో..

## బంగాళాఖాతంలో అల్పపీడన ప్రభావం

- పలు జిల్లాల్లో ఈదురుగాలులతో కూడిన వర్షం
- హైదరాబాద్‌లో పలుచోట్ల మోస్తరు వర్షం

**హైదరాబాద్,ఫిబ్రవరి23:** బంగాళాఖాతంలో అల్పపీడన ప్రభావంతో భాగ్యనగరంలో పలుచోట్ల వర్షం కురిసింది. సోమవారం మధ్యాహ్నం వరకు భానుడు తన ప్రతాపం చూపినప్పటికీ, మధ్యాహ్నం తర్వాత ఒక్కసారిగా వాతావరణం మారిపోయింది. ఆకాశం మబ్బుపట్టి చల్లని గాలులు వీచడంతో నగరంలో ఆహ్లాదకరమైన పరిస్థితులు నెలకొన్నాయి. చాలా రోజుల తర్వాత కురిసిన చిరు జల్లులు భాగ్యనగరాన్ని మురిపించాయి.ఇప్పుడిప్పుడే ఎండలు ముదురుతున్న తరుణంలో హైదరాబాద్ నగర ప్రజలను వరుణుడు పలకరించాడు. నగరంలో

మిగతా 2వ పేజీలో..

## ఉగాదికి జాబ్ క్యాలెండర్ విడుదల

### డిఎస్సీ కూడా అందులోనే ఉంటుంది

### ప్రశ్నోత్తరాల సమయంలో మంత్రి లోకేశ్ సమాధానం



అమరావతి,ఫిబ్రవరి23 (**చట్టం న్యూస్**): రాష్ట్రంలోని నిరుద్యోగులు ఎంతో కాలంగా ఎదురుచూస్తున్న జాబ్ క్యాలెండర్‌ను ఉగాది పండుగ సందర్భంగా విడుదల చేస్తామని మంత్రి లోకేశ్ ప్రకటించారు. ఈ జాబ్ క్యాలెండర్‌లోనే డీఎస్సీ(ఆ÷ూఅ) పోస్టులను కూడా చేర్చనున్నట్లు ఆయన స్పష్టం చేశారు. శాసనసభ సమావేశాల్లో భాగంగా 8వ రోజు ప్రశ్నోత్తరాలు సందర్భంగా రాష్ట్రంలోని విద్యావ్యవస్థ, నిరుద్యోగుల సమస్యలపై సభ్యులు అడిగిన ప్రశ్నలకు మంత్రి నారా లోకేశ్ సమాధానమిచ్చారు. ఇది ఉపాధ్యాయ వృత్తిని ఆశించే వేలాది మంది అభ్యర్థులకు పెద్ద ఊరటనిచ్చే అంశం. కస్తూర్బా గాంధీ బాలికా విద్యాలయాల పనితీరుపై ఆముదాలవలస ఎమ్మెల్యే కూన రవికుమార్, ఎమ్మెల్యే మురళీ మోహన్ పలు అంశాలను ప్రస్తావించారు. ఏపీలో కేజీబీవీ పాఠశాలల్లో 6 నుంచి 10వ తరగతితో పాటు ఇంటర్మీడియట్ కూడా అందిస్తున్నారని, ఇక్కడ పనిచేస్తున్న వారికి ఎంటిఎస్ అమలు చేయాలని, రెగ్యులర్ ప్రిన్సిపాళ్లను నియమించాలని కోరారు. దీనికి మంత్రి నారా లోకేశ్ సమాధానమిస్తూ.. ఇతర రాష్ట్రాల కంటే ఏపీలో కేజీబీవీలకు ఎక్కువ డిమాండ్ ఉందని, అడ్మిషన్ల కోసం తీవ్రమైన పోటీ నెలకొందని తెలిపారు. జీతాల పెంపుదలపై కేంద్ర ప్రభుత్వంతో చర్చించామని, కేంద్రం సహకారం అందిస్తే మరిన్ని చర్యలు చేపడతామని హామీ ఇచ్చారు. ఉన్నత విద్యలో ఇంజనీరింగ్‌తో పాటు పాలిటెక్నిక్, ఐటీఐల ప్రాధాన్యాన్ని మంత్రి వివరించారు. ఉత్తరాంధ్రలో ఏర్పడుతున్న

మిగతా 2వ పేజీలో..

## లోకేశ్, చంద్రబాబుల ఆదేశాలతోనే దాడి

### తన ఇంటిపై దాడికి పన్నాగం వారిదే అన్న అంబటి



గుంటూరు,ఫిబ్రవరి23 (**చట్టం న్యూస్**): తన ఇంటిపై జరిగిన దాడికి చంద్రబాబు, లోకేష్ ఆదేశాలే కారణమని మాజీ మంత్రి అంబటి రాంబాబు మరోసారి పునరుద్ఘాటించారు . సాయంత్రం ఐదునుంచి రాత్రి పన్నెండు గంటలవరకూ తన ఇంటిపై దాడి జరుగుతున్నా పోలీసులు పట్టించుకోలేదని, ఇది చంద్రబాబు, లోకేష్‌ల కుట్ర కాదా? అని ప్రశ్నించారు. సోమవారం మీడియాతో మాట్లాడిన అంబటి.. ' రాజమండ్రి జైలు నుంచి విడుదలైనప్పటినుంచి వైఎస్సార్‌సీపీ నాయకులు, కార్యకర్తలు వచ్చి సంఘీభావం ప్రకటించారు. వారందరికీ నా ధన్యవాదాలు. నేను జైలులో ఉన్నప్పుడు మా అధినేత జగన్ ఇంటికి వచ్చి కుటుంబ సభ్యులకు భరోసా కల్పించారు. 18 రోజులు జైలులో ఉండి బయటకు వచ్చిన

మిగతా 2వ పేజీలో..

## రాజమండ్రి కల్తీపాల ఘటన

### ప్రభుత్వ వైఫల్యమేనన్న బొత్స



**విజయవాడ,ఫిబ్రవరి23 (చట్టం న్యూస్):** రాజమండ్రిలో కల్తీ పాల ఘటనలో నలుగురు మృతి చెందడం బాధాకరమని వైఎస్సార్‌సీపీ నేత, మాజీ మంత్రి బొత్స సత్యనారాయణ అన్నారు. ఇది పూర్తిగా ప్రభుత్వ వైఫల్యం కారణంగా జరిగిన ఘటనేనని ఆయన ధ్వజమెత్తారు. ప్రభుత్వ మానటరింగ్ లేనందునే ఈ ఘటన చోటు చేసుకుందన్నారు. శాసనమండలి

మిగతా 2వ పేజీలో..

## తిరుమలలో నాకాబందీ

- విస్తృతంగా తనిఖీలు చేపట్టిన పోలీసులు
- ఆరు ప్రత్యేక బృందాలతో ఏకకాలంలో సోదాలు

**తిరుమల,ఫిబ్రవరి23 (చట్టం న్యూస్):** తిరుమలలో యాత్రికుల భద్రతను దృష్టిలో ఉంచుకుని అసాంఘిక కార్యకలాపాలపై ఉక్కుపాదం మోపేందుకు తిరుపతి జిల్లా పోలీస్ శాఖ పటిష్ట చర్యలు చేపట్టింది. తిరుమల డీఎస్పీ పర్యవేక్షణలో బాలాజీ నగర్ ప్రాంతంలో విస్తృత స్థాయి నాఖాబందీ కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో పోలీస్ శాఖతో పాటు టీటీడీ విజిలెన్స్, ఏపీ ఫారెస్ట్, టీటీడీ ఫారెస్ట్, ఫైర్ శాఖ, టీటీడీ రెవెన్యూ, రెవెన్యూ శాఖ, బిడి టీమ్స్, ఎక్సైజ్ శాఖ, హెల్త్ శాఖలకు చెందిన సుమారు 90 మంది సిబ్బంది పాల్గొన్నారు. మొత్తం 6 ప్రత్యేక బృందాలుగా ఏర్పడి ఏకకాలంలో బాలాజీ నగర్ ప్రాంతంలో క్షుణ్ణంగా తనిఖీలు నిర్వహించారు. తనిఖీలలో భాగంగా టీటీడీ కేటాయించిన నివాసాల్లో అనుమతిపొందిన వ్యక్తులే ఉంటున్నారా లేదా కొత్త వ్యక్తులు అనుమానాస్పదంగా నివసిస్తున్నారా అనే కోణంలో పరిశీలన

మిగతా 2వ పేజీలో..

## తెలంగాణ టిజి ఎడ్‌సెట్ నోటిఫికేషన్ విడుదల

**మొదటి పేజీ తరువాయి..**

స్వీకరణ ప్రారంభం కానుండగా, అభ్యర్థులు ఏప్రిల్ 15వ తేదీ వరకు ఎటువంటి అపరాధ రుసుము చెల్లించకుండా దరఖాస్తు చేసుకోవచ్చని తెలిపింది. గడువు ముగిసిన తర్వాత కూడా అభ్యర్థుల సౌకర్యార్థం అపరాధ రుసుముతో దరఖాస్తు చేసుకునే వెసులుబాటును అధికారులు కల్పించారు. రూ. 250 ఫైన్‌తో ఏప్రిల్ 23 వరకు, రూ. 500 ఫైన్‌తో ఏప్రిల్ 27 వరకు , రూ. 1000 అపరాధ రుసుముతో ఏప్రిల్ 30వ తేదీ వరకు దరఖాస్తులను అనుమతించనున్నారు. ఇక పరీక్షా నిర్వహణ విషయానికి వస్తే, మే 12వ తేదీన తెలంగాణ వ్యాప్తంగా టీజీ ఎడ్‌సెట్ ప్రవేశ పరీక్ష నిర్వహించనున్నారు. అభ్యర్థుల సంఖ్యను బట్టి ఉదయం , సాయంత్రం రెండు సెషన్లలో ఈ పరీక్షలు జరుగుతాయి. పరీక్ష పూర్తయిన మూడు రోజుల్లోనే అంటే మే 15న అధికారులు ప్రాథమిక కీని విడుదల చేస్తారు. దీనిపై అభ్యంతరాలు ఉంటే స్వీకరించిన అనంతరం, మే 30వ తేదీన తుది ఫలితాలను వెల్లడించనున్నారు. బీఈడీ కోర్సుల్లో చేరాలనుకునే అభ్యర్థులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని, పూర్తి వివరాల కోసం వెబ్‌సైట్‌ను సంప్రదించాలని యూనివర్సిటీ వర్గాలు వెల్లడించాయి.

## పాలకల్తీ మరణాలపై చంద్రబాబు ఆరా

**మొదటి పేజీ తరువాయి..**

ఆయన సమావేశ మయ్యారు. ప్రస్తుతం బాధితులకు అందుతున్న సాయాన్ని సీఎంకు వారు వివరించారు. మెరుగైన వైద్యం అందించాలని చంద్రబాబు ఆదేశించారు. అధికారులు వెంటనే అక్కడికి వెళ్లి సహాయక చర్యలు చేపట్టాలన్నారు. బాధజతులకు మెరుగైన వైద్య చికిత్సలు అందించాలని అన్నారు. రాజమహేంద్రవరం పరిసర ప్రాంతాల్లో విక్రయదారులు 106 ఇళ్లకు పాలు పంపిణీ చేశారని అధికారులు వివరించారు. పాలు వినియోగించిన కుటుంబాల్లోని 73 మంది నుంచి రక్తనమూనాలను సేకరించామని.. మిగిలిన వారివి కూడా సేకరిస్తున్నామని చెప్పారు. ఫుడ్ సేఫ్టీ అధికారులు పాల నమూనాలను పరీక్షల కోసం ల్యాబ్‌కు పంపారని తెలిపారు. క్షేత్రస్థాయిలో వైద్య శిబిరాలతో పాటు ర్యాపిడ్ టెస్ట్ మెడికల్ క్యాంపులు ఏర్పాటు చేశామని సీఎంకు అధికారులు వివరించారు. పాల నమూనాలపై ఫలితాల అనంతరం విక్రయదారులపై కఠిన చర్యలు తీసుకోవాలని చంద్రబాబు ఆదేశించారు. ఫుడ్ సేఫ్టీ, వైద్య ఆరోగ్యశాఖ ఉన్నతాధికారులు తక్షణమే రాజమహేంద్రవరం వెళ్లాలన్నారు.

## రాజమండ్రి కల్తీపాల ఘటన

**మొదటి పేజీ తరువాయి..**

సమావేశాల్లో భాగంగా సోమవారం మీడియా పాయింట్ వద్ద ఆయన మాట్లాడుతూ.. అవినీతి పెచ్చుమీరిపోవడమే ఈ కల్తీకి కారణమని మండిపడ్డారు. ఇది ప్రభుత్వ నిర్లక్ష్యం వల్ల జరిగిన హత్యలుగా భావిస్తున్నామని, పాలను కల్తీ చేసిన వారితో పాటు సంబంధిత అధికారులపై చర్యలు తీసుకోవాలన్నారు. ఈ ఘటనపై సమగ్ర దర్యాప్తు చేయాలని బొత్స డిమాండ్ చేశారు. పంటలకు గిట్టుబాటు ధరలేక రైతులు ఇబ్బంది పడుతున్నారని బొత్స మరోసారి స్పష్టం చేశారు. బీఏసీలో మూడు అంశాలపై ప్రస్తావించామని, అందులో రైతులకు గిట్టుబాటు ధర కూడా ఒకటన్నారు. తిరుమల లడ్డూ అంశంపై కూడా చర్చ జరగాలని కోరామని, కారు చౌకగా భూములు కేటాయింపులపై కూడా చర్చకు పట్టుబట్టునట్టి బొత్స పేర్కొన్నారు. చంద్రబాబు కుటుంబం సభ్యులు.. యూనివర్శిటీ పేరుతో విశాఖలో భూములు దోచుకుంటున్నారని మండిపడ్డారు. సభలో వెంకటేశ్వరస్వామి ఫోటోలను చెప్పులు ధరించి పట్టుకున్నట్లు ప్రచురించారని, మండలి చైర్మన్ చూపించిన ఫుటేజ్‌లో ఎలాంటి ఆధారాలు లేవన్నారు. అందుచేత మొత్తం వీడియో ఫుటేజ్‌ను తమకు ఇవ్వాలని కోరామన్నారు. వాస్తవాలను బయటపెట్టాలని మండలి చైర్మన్‌ను కోరామన్నారు బొత్స.

## సత్ప్రవర్తన ఖైదీలకు క్షమాభిక్ష

**మొదటి పేజీ తరువాయి..**

కేటగిరీలుగా విభజిస్తామని పేర్కొన్నారు. ఖైదీలు మారేందుకు, మానసిక పరివర్తన తెచ్చేలా ఓపెన్ ఎయిర్ జైళ్లు ఏర్పాటు చేస్తున్నట్లు తెలిపారు. ఖైదీలు.. వ్యవసాయంతో పాటు ఇతర వృత్తులు నిర్వహించేలా చర్యలు చేపడతామన్నారు. ఇక ఈ బిల్లుపై చర్చలో పొన్నూరు ఎమ్మెల్యే దూళిపాళ్ల నరేంద్ర పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. జైళ్ల శాఖ ఎదుర్కొంటున్న సమస్యలపై ఈ చట్టంలో ప్రస్తావన లేదన్నారు. జైళ్లలో ఖైదీల సంఖ్య పెరిగినా సౌకర్యాలు మాత్రం పెరగటం లేదంటూ ఆవేదన వ్యక్తం చేశారు. జైళ్ల శాఖలో 30 శాతం సిబ్బంది పోస్టులు ఖాళీగానే ఉన్నాయని వివరించారు. జైళ్లలో మహిళా సిబ్బంది కొరత చాలా ఎక్కువగా ఉందని గుర్తు చేశారు. అండర్ ట్రయల్ ఖైదీలు న్యాయ సహాయం లేకపోవడంతో జైళ్లలోనే ఉండిపోతున్నారని గుర్తు చేశారు. చిన్న చిన్న కేసుల్లో రిమాండ్ ఖైదీలుగా ఉన్న వారి సత్ ప్రవర్తన ఆధారంగా బయటకు పంపించాలన్నారు. ఖైదీలు జైలు నుంచి బయటకు వచ్చాక జనజీవన స్రవంతిలో కలిసేలా చర్యలు తీసుకోవాలని ప్రభుత్వానికి సూచించారు. వైసీపీ ప్రభుత్వంలో తాము సైతం జైలుకు వెళ్లాల్సి వచ్చిందని చెప్పారు. జీవిత ఖైదు పడిన ఖైదులు 60 ఏళ్లు వయసు దాటిన వారికి క్షమాబిక్ష ప్రసాదించాలంటూ ప్రభుత్వానికి సూచించారు. క్షమాబిక్ష కోసం జైళ్లలోని చాలామంది ఖైదీలు ఎదురు చూస్తున్నారన్నారు. ఆ తర్వాత జైళ్లు, సంస్కరణల చట్టం సవరణ బిల్లును శాసనసభ ఆమోదించింది.

## ఉగాదికి జాబ్ క్యాలెండర్ విడుదల

**మొదటి పేజీ తరువాయి..**

పారిశ్రామిక ఎకో సిస్టమ్‌కు అనుగుణంగా విద్యార్థుల్లో నైపుణ్యాలను అభివృద్ధి చేస్తున్నట్లు తెలిపారు. విజయనగరం ప్రభుత్వ పాలిటెక్నిక్ కళాశాల మరమ్మతులను 'క్లస్టర్ బేస్డ్ అప్రోచ్' ద్వారా వచ్చే ఏడాదిలోగా పూర్తి చేస్తామని మంత్రి వెల్లడించారు.

## లోకేశ్, చంద్రబాబుల ఆదేశాలతోనే దాడి

**మొదటి పేజీ తరువాయి..**

తర్వాత ప్రెస్ మీట్ పెట్టి వాస్తవాలు వివరించే ప్రయత్నం చేశాను. నన్ను అరెస్టు చేసి తీసుకెళ్ళిన తర్వాత నా ఆఫీసు, ఇల్లు తగలబెట్టాలని నిర్ణయించుకున్నారు. మా ఇంట్లోనుంచి నా భార్య, కూతుర్లు వెనుకనుంచి బయటకు వెళ్లాల్సిన పరిస్థితి వచ్చింది. ఇందుకు సీఎం చంద్రబాబే బాధ్యుడు. ఏడు గంటలు పోలీసులు నిర్వీర్యంగా ఉండడానికి చంద్రబాబు, లోకేష్ ఆదేశాలే కారణం. మీరు కాదని చెప్పండి.. ఆవేశంలో దాడులు చెయ్యడం చూశాం. కానీ సాయంత్రం ఐదునుంచి రాత్రి పన్నెండు గంటలవరకూ పోలీసులు పట్టించుకోలేదు. ఇది మీ కుట్ర కాదా చంద్రబాబు.మాజీ మంత్రి ఇంటిపై దాడి చేస్తుంటే ఎందుకు నిర్వీర్యంగా ఉన్నారో చెప్పాలి' అని డిమాండ్ చేశారు.

## తిరుమలలో నాకాబందీ

**మొదటి పేజీ తరువాయి..**

చేపట్టబడింది. ప్రతి విభాగం వారు తమ తమ శాఖలకు సంబంధించిన అంశాలపై సమగ్ర తనిఖీలు నిర్వహించారు. ఈ నాఖాబందీ కార్యక్రమంలో మొత్తం 820 ఇళ్లను తనిఖీ చేయగా, సరైన గుర్తింపు కార్డులు లేని 16 మంది అనుమానితులను అదుపులోకి తీసుకు న్నారు. అలాగే గుర్తింపు పత్రాలు లేని 11 వాహనాలను స్వాధీనం చేసుకున్నారు. ఈ సందర్భంగా పోలీసు అధికారులు స్థానికులతో సమావేశమై, తమ ఇళ్లను అపరిచిత వ్యక్తులకు బాడుగకు ఇవ్వవద్దని, సరైన గుర్తింపు లేకుండా ఎవరినీ పనులకు నియమించవద్దని సూచించారు. తిరుమల పవిత్రతకు భంగం కలిగించే విధంగా ఎవరూ ప్రవర్తించరాదని స్పష్టం చేశారు. స్థానిక నివాసులు ఈ నాఖాబందీ కార్యక్రమానికి పూర్తి స్థాయిలో సహకారం అందించగా, తిరుమలలో శాంతి భద్రతల పరిరక్షణలో పోలీస్ శాఖ మరింత కట్టుదిట్టమైన చర్యలు కొనసాగిస్తుందని అధికారులు తెలిపారు.తిరుపతి జిల్లా ఎస్పీ ఎల్ సుబ్బరాయుడు, టీటీడీ చీఫ్ విజిలెన్స్ అండ్ సెక్యూరిటీ అధికారి మురళీకృష్ణ, ఆదేశాల మేరకు, తిరుమల అదనపు ఎస్పీ సూచనలతో ఈ తనిఖీలు చేపట్టారు.

## వికసిత బెంగాల్ బాధ్యత నాది

**మొదటి పేజీ తరువాయి..**

స్వచ్ఛభారత్ అభియాన్ కింద 85 లక్షల టాయిలెట్లను రాష్ట్రంలో నిర్మించామని చెప్పారు. చిన్న వ్యాపారులు, ఔత్సాహిక పారిశ్రామిక వేత్తలకు రూ.2.82 లక్షల కోట్లు రుణాలిచ్చామని, 56 లక్షల మంది సీనియర్ సిటిజన్లకు అటల్ పెన్షన్ యోజన కింద లబ్ది చేకూర్చామని, ఉజ్వల్ యోజన కింద కోటికి పైగా ఎల్పీజీ కనెక్షన్లు ఇచ్చామని చెప్పారు. 'కిసాన్ సమ్మాన్ నిధి' ద్వారా 52 లక్షల మంది రైతులకు నేరుగా ఆర్థిక సాయం అందించామని వివరించారు.'నేతాజీ సుభాష్ చంద్రబోస్ పుట్టిన గడ్డలో ఇవాళ అక్రమ చొరబాట్లు, మహిళలపై హింసాత్మక ఘటనలు చోటుచేసుకుంటున్నాయి. రబీంద్రనాథ్ ఠాగూర్ కలలుకన్న సోనార్ బంగ్లా ప్రమాదంలో పడింది. ఇవాళ బెంగాల్ పూర్వ గౌరవాన్ని పునరుద్ధరించాలి. మార్పు అనివార్యం. బెంగాల్ అభివృద్ధి ప్రయాణంలో అంతా కలిసిరావాలి. 2026లో వికసిత్ వెస్ట్ బెంగాల్ కోసం ప్రతినబూనుదాం' అని మోదీ ఆ లేఖలో విజ్ఞప్తి చేశారు.

# దిగుమతులపై సుంకాల విధింపు నిలిపివేత

**మొదటి పేజీ తరువాయి..**

శాతానికి పెంచారు. ఐఈఈపీఏ చట్టానికి బదులు వాణిజ్య చట్టం-1974లోని సెక్షన్ 122 కింద సర్‌చార్జ్ పేరిట ఈ సుంకాలకు తెరతీశారు. అయితే, అమెరికా చట్టసభల అనుమతి లేనిదే వీటిని కూడా 150 రోజులకు మించి పొడిగించే అవకాశం లేదు. ఇక జాతీయ భద్రత పేరిట స్టీల్, అల్యూమినియం, సెమీకండక్టర్స్, ఆటో రంగాలపై గతంలో విధించిన సుంకాలనూ ట్రంప్ కొనసాగిస్తున్నారు. ఈ నేపథ్యంలో శాశ్వత ప్రాతిపదికన సుంకాలు విధించేందుకు మార్గాలను అన్వేషించాలని వాణిజ్య విభాగానికి ఆయన సూచించినట్టు అంతర్జాతీయ మీడియాలో కథనాలు వెలువడ్డాయి. ఇకపోతే సుంకాల విధింపు చెల్లదంటూ అమెరికా సుప్రీం కోర్టు తీర్పు నేపథ్యంలో ట్రంప్ ప్రభుత్వానికి కొత్త చిక్కులు మొదలయ్యాయి. సుంకాల వల్ల ఇప్పటివరకూ అధిక ధరలు చెల్లించిన అమెరికన్ కస్టమర్లు తమకు రీఫండ్స్ కావాలని పట్టుబడుతున్నారు. ఈ జాబితాలో ట్రంప్ రాజకీయ ప్రత్యర్థులతో పాటు కార్పొరేట్ కంపెనీలు కూడా ఉన్నాయి. అయితే, ఈ ప్రక్రియ అంత సులభం కాదని అక్కడి నిపుణులు చెబుతున్నారు.తాను విధించిన సుంకాల భారం విదేశీ ఎగుమతిదారులపై తప్ప సామాన్య అమెరికన్లు, అమెరికా దిగుమతి దారులపై లేదని ట్రంప్ ఇప్పటివరకూ చెబుతూ వచ్చారు. అయితే, ఆయన రాజకీయ ప్రత్యర్థులు మాత్రం ఈ వాదనతో మొదటి నుంచీ విభేదిస్తున్నారు. అధిక సుంకాల భారాన్ని సామాన్య అమెరికన్లే భరించాల్సి వచ్చిందని మండిపడేవారు. ఇక సుప్రీం తీర్పు తరువాత ఇల్లినాయ్ రాష్ట్ర గవర్నర్ సుంకాల రీఫండ్స్ కోరుతూ ట్రంప్‌నకు బిల్లులు పంపించారు. సుంకాల కారణంగా తమ రాష్ట్రం 9 బిలియన్ డాలర్లు అధికంగా చెల్లించాల్సి వచ్చిందని అన్నారు. తమ రాష్ట్రంలోని ఒక్కో కుటుంబంపై సగటున 1,700 డాలర్ల అదనపు భారం పడిందని అన్నారు. ఇక కార్పొరేట్ కంపెనీలు కూడా రీఫండ్స్‌కు సిద్ధమవుతున్నాయి. కాస్ట్‌కో, రెవ్లాన్ వంటి పలు సంస్థలు ఇప్పటికే కేసులు దాఖలు చేశాయి. ఇప్పటివరకూ ట్రంప్ ప్రభుత్వం సుంకాల పేరిట 133 బిలియన్‌ల నుంచి 175 బిలియన్ డాలర్ల మేర వసూలు చేసి ఉంటుందని అమెరికా వర్గాలు భావిస్తున్నాయి. సుంకాల డబ్బులో ఎంతో కొంత తిరిగిస్తామని ట్రంప్ వర్గం ఇప్పటికే పలుమార్లు తెలిపింది. అయితే, ఇది అంత ఆషామాషీ వ్యవహారం కాదని అక్కడి నిపుణులు చెబుతున్నారు. సామాన్య ప్రజలకు నేరుగా రీఫండ్స్ అందే అవకాశాలు తక్కువని ట్రెజరీ సెక్రెటరీ స్కాట్ బెస్సెంట్ కూడా పేర్కొన్నారు. రీఫండ్స్‌లో అధికభాగం దిగుమతిదారులు, అమెరికన్ కంపెనీలకే వెళుతుందని చెబుతున్నారు. విదేశీ ఉత్పత్తుల దిగుమతి సమయంలో వీరే కస్టమ్స్ శాఖకు నేరుగా సుంకాల రూపంలో అధిక ధరలను చెల్లించారని వివరిస్తున్నారు. రీఫండ్స్ ప్రక్రియ కూడా సంక్లిష్టంగా ఉంటుందని ఇప్పటికే జస్టిస్ ఏమీ కోనీ బేరెట్, జస్టిస్ బ్రెట్ కేవనా హెచ్చరించారు. ఈ విషయంలో కోర్టు కేసులు కొలిక్కి వచ్చేసరికి రెండు నుంచి నాలుగేళ్ల సమయం పడుతుందని ట్రంప్ కూడా ఇటీవల ఓ సందర్భంలో స్వయంగా అంగీకరించారు. వేల కొద్ది దిగుమతిదారుల రిఫండ్స్ అభ్యర్థనలను పరిశీలించడం కస్టమ్స్ శాఖకూ భారంగా మారుతుందని అంటున్నారు. ఇక అంతర్జాతీయ స్థాయిలో కూడా ట్రంప్ సర్కారు పలు కేసులు ఎదుర్కోవాల్సి వస్తుందని వాణిజ్య నిపుణులు చెబుతున్నారు. న్యూయార్క్ ఫెడ్, జేపీ మోర్గన్, కీల్ ఇన్‌స్టిట్యూ?ట్ అంచనా ప్రకారం, కస్టమ్స్ శాఖ వసూలు చేసిన సుంకాల్లో 90 నుంచి 96 శాతం అమెరికన్ల జేబుల్లోంచే వెళ్లాయి. భారత్, చైనా, మెక్సికో లాంటి దేశాలు తమ ఉత్పత్తుల ధరల తగ్గింపు రూపంలో 4-10 శాతం మాత్రమే సుంకాల భారాన్ని భరించాయి.

# ఎపిలో ప్రారంభమైన ఇంటర్ పరీక్షలు

**మొదటి పేజీ తరువాయి..**

అనుమతించబోమని ఇప్పటికే ఇంటర్మీడియట్ బోర్డు స్పష్టం చేసింది. ఈ నేపథ్యంలో విద్యార్థులంతా పరీక్ష ప్రారంభ సమయం కంటే దాదాపు గంట ముందే పరీక్ష కేంద్రాలకు చేరుకున్నారు. రాష్ట్రంలో ఈ ఏడాది ఇంటర్ పరీక్షలకు మొత్తం 10,57,899 మంది విద్యార్థులు హాజరుకానున్నారు. మొదటి సంవత్సరం పరీక్షకు 5,31,275 మంది విద్యార్థులు హాజరయ్యారు. రేపటి నుంచి అంటే మంగళవారం నుంచి మొదలయ్యే ద్వితీయ సంవత్సరం పరీక్షలకు 5,26,264 మంది విద్యార్థులు హాజరుకానున్నారు. రాష్ట్ర వ్యాప్తంగా ఇంటర్ పరీక్షల కోసం1,537 కేంద్రాలను ప్రభుత్వం ఏర్పాటు చేసింది. పరీక్ష కేంద్రాల్లోకి మొబైల్ ఫోన్లు, స్మార్ట్ వాచ్‌లు సహా ఎలాంటి గాడ్జెట్‌లకు అనుమతి లేదని ఇప్పటికే విద్యార్థులకు బోర్డు స్పష్టం చేసింది. ప్రతి పరీక్ష కేంద్రం వద్ద సీసీటీవీ కెమెరాలతో నిఘా



ఏర్పాటు చేసింది. అలాగే ఆ ప్రాంతంలో 144 సెక్షన్ అమలు చేస్తున్నారు. మార్చి 24వ తేదీ వరకు పరీక్షలు జరగనున్నాయి. విద్యా సంవత్సరంలో చేపట్టిన సంస్కరణల నేపథ్యంలో మొదటి సంవత్సరం గణితం, ఫిజిక్స్, కెమిస్ట్రీ, ఎకనామిక్స్, సివిక్స్, కామర్స్, హిస్టరీ సబ్జెక్టులకు 32 పేజీల బుక్‌లెట్ ఇవ్వనున్నారు. మిగిలిన, బ్యాక్‌లాగ్ సబ్జెక్టులకు, రెండో సంవత్సరం అన్ని సబ్జెక్టులకూ 24 పేజీల బుక్‌లెట్‌ను అందజేయనున్నారు. ఈ బుక్‌లెట్‌లోనే విద్యార్థులు జవాబులు రాయాల్సి ఉంటుంది. అదనపు జవాబు పత్రాలు ఇవ్వరు.విద్యార్దులను క్షుణ్ణంగా పరిశీలించి ఎటువంటి ఎలక్ట్రానిక్ పరికరాలు వెంట తీసుకెళ్లకుండా పరిశీలించి లోపలికి అనుమతించారు. బాలురు కు పురుషులు, బాలికలకు మహిళా సిబ్బంది చెక్ చేసి లోపలికి అనుమతించారు. మొదటి పరీక్ష కావడంతో విద్యార్దులు వెంట తల్లి తండ్రులు వచ్చి పరీక్ష కేంద్రాలకు తీసుకెళ్లారు..విద్యార్దులు ఉత్సాహంగా ఒకరిని ఒకరు శుభాకాంక్షలు చెప్పుకుంటూ లోపలికి వెళ్ళారు. ఉదయం చేరుకున్న విద్యార్థులు వారి యొక్క హాల్ టికెట్స్ నెంబర్ల సరి చూసుకొని పరీక్ష కేంద్రం లోపలికి వెళ్ళారు.

# పూర్వ విద్యార్థుల అపూర్వ సమ్మేళనం.




**మహబూబాబాద్ జిల్లా ప్రతినిధి ఫిబ్రవరి 23, (చట్టం న్యూస్) :** విద్యాభారతి గురుకుల పాఠశాలలో 40 సంవత్సరాల పూర్వ విద్యార్థులు అపూర్వ సమ్మేళనం నిర్వహించడం జరిగింది. ఈ అపూర్వ సమ్మేళనానికి పాఠశాల కరప్పాడెంట్ తక్కెళ్ళపల్లి ప్రభాకర్ రావు అద్యక్షత వహించడం జరిగింది. ఈ సందర్భముగా ప్రభాకర్ రావు మాట్లాడుతూ 1985లో స్థాపించబడిన విద్యాభారతి నిరాటకంగా 40 సంవత్సరాలు పూర్తి చేసుకోవడం జరిగింది. ఈ 40 సంవత్సరాలలో 27 ఎస్ ఎస్ సి బ్యాచ్ లు విద్యను అభ్యసించి పాస్ అయ్యి వెళ్ళడం జరిగింది. మా పూర్వ విద్యార్థులు వివిధ దేశాల లోపల సాఫ్ట్వేర్ ఇంజనీర్లుగా స్థిర పడినారు. అంతేగాక డాక్టర్లుగా వివిధ హోదలలో ప్రభుత్వ ఉద్యోగులుగా ఆద్యా పకులుగా పారిశ్రామిక వేత్తలుగా వ్యాపార వేత్తలుగా స్థిరపడినారని తెలియజేశారు. ఈ 40 సంవత్సరాలలో భాగముగా విద్యాభారతి పాఠశాల ఆవరణలో 1985 నుండి నేటి వరకు చదువు కున్న విద్యార్థులందరూ కూడా అపూర్వకంగ కలుసుకోవడం జరిగింది. దాదాపు . 2500 పూర్వ విద్యార్థులు వివిధ స్థాయిలలో పాఠశాలకు వచ్చి తమ మధుర జ్ఞాపకాలను స్మరించుకున్నారు. వాళ్ళ తరగతి గదులలో విద్యార్థులుగా మారి అప్పటి ఉపాధ్యాయులచే పాఠాలు చెప్పించుకుని కేరింతలు కొట్టారు. ఈ సందర్భముగా పూర్వ విద్యార్థులు మరిపెడ మున్సిపాల్ చైర్మెన్ ప్రగతి శ్రీ పాల్ రెడ్డిని ఘణమంగా సన్మానించడం జరిగింది. ఇంకా. పూర్వ విద్యార్థులిన డీస్పీ బోడ్డు అశోక్, హతిరామ్ లను సన్మానించడం జరిడింది 1989 బ్యాచ్ అందరిని ఉన్నత స్థాయిలో స్థిరపడిన విద్యార్థులకు పాఠశాల కరెస్పాండంట్ ప్రభాకర్ రావు సన్మానించాడం జరిగింది. పాఠశాలలో సాంస్కృతి కార్యక్రమాలు నిర్వహించి, పూర్వ ఉపాధ్యాయులను ప్రస్తుత ఉపాద్యాయులను ఘణమగా సన్మానించి మెమెంటాలు అందజేశారు. 37 బ్యాచ్లకు సంబంధించిన విద్యార్థులు తరగతుల వారిగా కరస్పాడెంటల్ సన్మానించడం జరిగింది; ఇక ఈ కార్యక్రమంలో సిని సంగిత దర్శకుడు బాలశావలి ప్రలేదు. ఆకర్షణగా నిలిచారు చక్కని సంగీత కాక్యక్రమాలు నిర్వహించారు. జబర్దస్ట్ ఫేమ్ రాజమౌళి హస్య భరితమైన కార్యక్భమాలు నిర్వహించారు. ఈ సందర్భముగా వారివురిని పాఠశాల కరెస్పాండంట్ ప్రభాకర్ రావు ఘణంగా సన్మానించారు న భూతో న భవిష్యత' అన్నట్లుగా పూర్వ విద్యార్థులు ఆట పాటలతో నాట్యలతో చిన్న పిల్లలాగా మారి సంతోషముగా గడిపారు. ఆర్గనైజింగ్ కమిటీ ఉల్యాల శ జైపాల్ రెడ్డి సంద నరేష్, బోయినపల్లి సతిష్, అజయ్, కార్తిక్ మొదలైన వారు ఉన్నారు అలాగే పాఠశాల ఉపాధ్యాయుని ఉపాధ్యాయలైన సుష్మిత, ప్రదీప్,మోహన్, నాగరాజు, తదితరులు వేలాదిగా పూర్వ విద్యార్థులుసమ్మేళనానికి ప్రస్తుత విద్యార్థిని విద్యార్థులు పాల్గొన్నారు.





## బంగాళాఖాతంలో అల్పపీడన ప్రభావం

**మొదటి పేజీ తరువాయి..**

ఆకాశం మేఘావృతం కాగా.. ఖైరతాబాద్, ముషీరాబాద్, ఆర్టీసీ క్రాస్ రోడ్, కాచిగూడ సహా పలుచోట్ల చిరు జల్లులు కురుస్తున్నాయి. మరోవైపు మేడ్చల్ మల్కాజిగిరి జిల్లాలో వాతావరణం ఒక్కసారిగా మారింది. ఈదురుగాలులతో కూడిన వర్షం కురుస్తోంది. నైరుతి బంగాళాఖాతంలో ఏర్పడిన ద్రోణి ప్రభావం వల్లే వర్షాలు కురుస్తున్నట్లు వాతావరణశాఖ అధికారులు వెల్లడించారు. ముఖ్యంగా అబిడ్స్, బషీర్ బాగ్, సైఫాబాద్, ట్యాంక్ బండ్, సికింద్రాబాద్ పరిసర ప్రాంతాల్లో తేలికపాటి వర్షం కురిసింది. అలాగే మీర్ పేట్, బడంగ్ పేట్ ప్రాంతాల్లోనూ వాన పడింది. ఎల్బీ నగర్, మలక్ పేట్, సరూర్ నగర్, చార్మినార్, బీఎన్ రెడ్డి, ఉప్పల్, నాగోల్, అంబర్ పేట్, వనస్థలిపురం, హయత్ నగర్ వంటి ప్రాంతాల్లో ఈదురు గాలులు బలంగా వీచాయి. వికారాబాద్ ప్రాంతంలో వీస్తున్న భారీ ఈదురు గాలులు ప్రస్తుతం హైదరాబాద్ దిశగా వేగంగా కదులుతున్నాయి. ఈ ప్రభావంతో సాయంత్రం 6 గంటల తర్వాత గచ్చిబౌలి, రాజేంద్ర నగర్, లింగంపల్లి పరిసర ప్రాంతాల్లో బలమైన గాలులతో కూడిన చిరు జల్లులు కురిసే అవకాశం ఉందని వాతావరణ నిపుణులు అంచనా వేస్తున్నారు. నగరంలో వాతావరణం చల్లబడితే, జిల్లాల్లో మాత్రం ఈదురు గాలులు బీభత్సం సృష్టించాయి.. జయశంకర్ భూపాలపల్లి జిల్లా మహాదేవపూర్ మండలం కాళేశ్వరంలో ఈదురు గాలులతో కూడిన భారీ వర్షం పడింది. గాలుల ధాటికి పలుచోట్ల చెట్లు విరిగిపడటంతో విద్యుత్ సరఫరాకు తీవ్ర అంతరాయం ఏర్పడింది. సిద్దిపేట జిల్లాలోని దుబ్బాకలో ఉరుములు, మెరుపులతో కూడిన వడగండ్ల వాన (రాళ్ల వర్షం) కురిసింది. భారీ గాలుల కారణంగా షాపుల బోర్డులు, ఫ్లెక్సీలు ఎగిరిపోయాయి. కొన్ని రేకుల ఇళ్లు పాక్షికంగా ధ్వంసమయ్యాయి. రోడ్లన్నీ జలమయం కావడంతో వాహనదారులు తీవ్ర ఇబ్బందులు పడ్డారు.

## గుల్లకోట రైతు వేదికలో రైతులకు అవగాహన సదస్సు నిర్వహించిన వ్యవసాయ అధికారులు



**ఎండపల్లి ఫిబ్రవరి 23 చట్టం :** జగిత్యాల జిల్లా ఎండపల్లి మండలం గుల్లకోట రైతు వేదికలో సోమవారం రోజున . అగ్రికల్చర్ టెక్నాలజీ మేనేజ్మెంట్ ఏజెన్సీ ఆధ్వర్యంలో ప్రత్యేక అవగాహన కార్యక్రమం నిర్వహించారు. అధిక రసాయన ఎరువులు వాడడం వల్ల భూమిలో ఉండే మొక్కకు సరిపడే సారవంతత తగ్గిపోవడం రసాయన ఎరువులు అధికంగా వాడడంతో భూమిలో ఉండే సూక్ష్మజీవులు నశించి భూమి దెబ్బతింటుందని రైతులకు శాస్త్రీయ పద్ధతిలో వాడకాన్ని వివరించారు. ఎక్కువగా మొక్కలు వచ్చే తెగుళ్లను గుర్తించి నానో యూరియా పిచికారి చేసే మందులే వాడలి తప్ప మితిమీరి రసాయన ఎరువులు వాడడం తగ్గించాలని వివరించారు. ఈ కార్యక్రమంలో వెల్గటూర్, ఎండపల్లి వ్యవసాయ విస్తరణ అధికారులు సందీప్, మహేష్ , సాయి కిరణ్, రైతులు తదితరులు పాల్గొన్నారు.

# సమస్యలు పరిష్కరించండి లబో దిబోమంటున్నా మండల, ప్రజలు. రైతులు, విద్యార్థులు






**నార్పల, ఫిబ్రవరి,23,(చట్టం) న్యూస్ :** నార్పల తహశీల్దార్ కార్యాలయంలో అధికారులు లేక ప్రజలకు దిక్కు దివాణం లేకుండాపోయింది. మండల ప్రజలు, రైతులు, విద్యార్థులు తమ సమస్యలు పరిస్కారం కోసం కార్యాలయం చుట్టు తిరుగుతు అక్కడ అధికారులు లేక ఆవేదన చెందుతున్నారు. మండలంలో 12 రెవిన్యూ గ్రామాలున్నాయి. 2011 సెన్సెస్ ప్రకారం 54,973 మంది జనాభా ఉంన్నారు. మండలం మొత్తము17 పంచాయితీలు, 38 గ్రామాలు ఇంత పెద్ద వ్యాపార, వాణిజ్య కేంద్రంగా ఉన్న మండలంలో తహశీల్దార్ లేకపోవడమే కాకుండా డిప్యూటీ తహశీల్దార్ తోపాటు ఆర్ ఐ, ఏఎస్ఓ, లేకపోవడం శోచనియ్యం. తహశీల్దార్, డిప్యూటీ తహశీల్దార్, సివిల్ సప్లయ్ డిప్యూటీ తాసిల్దార్ రీ సర్వే తాసిల్దార్ మండల సర్వేయర్ ఏఎస్ఓ, ఆర్ ఐ, సీనియర్ అసిస్టెంట్, జూనియర్ అసిస్టెంట్, రెగ్యులర్ జూనియర్ అసిస్టెంట్, కంప్యూటర్ జూనియర్ టైపిస్టు, కంప్యూటర్ ఆపరేటర్, ఎలక్షన్ కంప్యూటర్ ఆపరేటర్, ఆఫీస్ అటెండెర్ ఇద్దరు, వాచ్మెన్ ఒకరు, చైన్మెన్ ఒకరు వంటి పోస్టులు ఖాళీగా ఉన్నాయి. ఉన్న అరకొరు పోస్టులకు. మూలిగే నక్కపై తాటి కాయ పడ్డట్టు ఇందులో ఇక్కడున్న తాహాశీల్దార్ అరుణకుమారిని దీప్యూటేషన్ పై అహుడాకు బదిలీ చేసారు. బుక్కరాయ సముద్రం మండలం తహాశీల్దార్ శ్రీధర్ మూర్తిని నార్పల ఇన్చార్జ్ తాహాశీల్దార్ గా కేటాయించారు. గత కొద్ది రోజులుగా శ్రీధర్ మూర్తి కూడా ఆనారోగ్య సమస్యలపై ఆసుపత్రిలో చేరడంతో ఇక్కడ తహాశీల్దార్ పోస్ట్ కూడా ఖాళీ ఏర్పడింది. ఇక్కడ ఉన్న డిప్యూటీ తాహాశీల్దార్ ప్రకాష్ రావు కూడా ఆనారోగ్య సమస్యలపై సెలవులో వెళ్ళిపోయారు. దింతో తహాశీల్దార్, డిప్యూటీ తహాశీల్దార్, ఆర్ ఐ, సివిల్ సప్లయ్ డి టీ, ఏ ఎస్ ఓ సీట్లు ఖాళీగా దర్శమిస్తున్నాయి జూనియర్ అసిస్టెంట్ కలెక్టర్ ఆఫీస్ విధులపై వెళ్లారు. ఆర్ఐ కూడా సెలవ్ పై వెళ్లారు. అటెండర్ పోస్టు ఖాళీ ఉంది. వాచ్మెన్, చైన్మెన్ లు లేరు విఆర్ఓ లలో బిపప్పర్ బండ్లపల్లి, గూగూడు, దుగుమర్రి ఖాళీగా ఉన్నాయి. చామలూరు విఆర్ఓ కూడా ప్రమోషన్ పై వెళ్లనున్నారు. ఇన్ని ఖాళీలు ఏర్పడ్డ ఈ తహాశీల్దార్ కార్యాలయం ప్రజలకు ఏరకమైన సేవలు అందిస్తోందన్న విషయం తేట తెల్లమౌతోంది. రౌతును బట్టి గుర్రం అన్న చందంగా అడిగేవారు లేరని ఇక్కడ పనిచేస్తున్న కొందరు వీఆర్వోఓలు, సిబ్బంది సైతం సక్రమంగ విధులకు హాజరు కాక ఇష్టాను సారం వ్యవహరిస్తుడటంతో ప్రజలకు ఖాళీ కుర్చీలు దర్శనమిస్తున్నాయి. దింతో కార్యాలయంలో ప్రజలకు అందాల్సిన ఫ్యామిలీ మెంబర్ సర్టిఫికెట్, ఈ డబ్ల్యూ ఎస్, ఓబీసీ, సర్టిఫికెట్, మూటేషన్ వంటి చర్యలు ఆగి పోయాయాని మాకేవురు దిక్కని ప్రజలు ఆవేదన చెందుతున్నారు. అసలు జిల్లా స్థాయిలో అధికారులు, ప్రజా ప్రతినిధులు ఉన్నారా...? ఉంటే ఈసమస్యలు పట్టవా.. అంటూ ప్రజలు వాపోతున్నారు. ఇప్పటికైనా అధికారులు రెగ్యులర్ తహాశీల్దార్ తోపాటు ఇతర అధికారులను నియమించాలని మండల ప్రజలు కోరుతున్నారు

# పట్టుకోండి చూద్దాం అంటున్న దొంగలు





**నార్పల ఫిబ్రవరి 23, (చట్టం) న్యూస్ :** నార్పల మండల కేంద్రంలోరోజు రోజుకు రెచ్చిపోతున్న దొంగలు "పట్టుకోండి చూద్దాం" అన్నట్టుగా సవాల్ విసురుతున్నారు.నార్పల గ్రామంలోని సుల్తాన్ పేటలో ఉన్న ఇండియన్ పెట్రోల్ బంక్ సమీపంలో నిలిపివున్న బొలెరో వాహనానికి చెందిన రెండు వెనుక టైర్లను ఆదివారం రాత్రి దుండగులు ఎత్తుకెళ్లారు. సుమారు రూ.45 వేల విలువైన ఈ టైర్లు రాత్రికి రాత్రే మాయం కావడంతో బాధితుడు వడ్డే మహేష్ తీవ్ర ఆవేదన వ్యక్తం చేశారు.

ఇదే వ్యక్తికి చెందిన వాహనానికి నాలుగు నెలలు క్రితమే రెండు టైర్లు దొంగిలించగా,ఇప్పుడు మరోసారి అదే తరహాలో దొంగతనం జరగడం అనుమానాలకు తావిస్తోంది. "తెలిసిన వారే ఈ పని చేసి ఉంటారు" అని మహేష్ అభిప్రాయపడ్డారు.ఫిర్యాదు ఇచ్చినా ఫలితం లేదంటున్న బాధితుడు నాలుగు నెలల క్రితం కొత్తగా షోరూమ్ నుంచి తీసుకువచ్చిన వాహనాన్ని దుగుమర్రి రోడ్ కాలేజ్ గేట్ ముందు పార్క్ చేయగా,అప్పట్లో కూడా రెండు టైర్లు మాయ మయ్యాయి.ఆ ఘటనపై ఫిర్యాదు చేసినప్పటికీ ఇప్పటివరకు ఎటువంటి పురోగతి లేదని బాధితుడు వాపోయాడు.ఇప్పుడు మళ్లీ అదే ఘటన పునరావృతం కావడంతో నిరాశ,భయాందోళనలకు గురయ్యాడు.కూలి చేసి బ్రతుకుతున్న వారికి రక్షణ లేదా?

రోజువారీ కూలి పనులు చేసుకుంటూ జీవనం సాగిస్తున్న తనలాంటి వారికి భద్రత లేకపోవడం బాధాకరమని మహేష్ తెలిపారు.వరుస దొంగతనాలతో ఆర్థికంగా నష్టపోయి తీవ్ర మనోవేదనకు గురవుతున్నట్లు చెప్పారు.

**పోలీసుల దృష్టి ఎప్పుడు?**

గ్రామంలో వరుసగా జరుగుతున్న దొంగతనాలపై పోలీసులు ప్రత్యేక దృష్టి సారించి,నిందితులను గుర్తించి కఠిన చర్యలు తీసుకోవాలని స్థానికులు కోరుతున్నారు.రాత్రి వేళల్లో గస్తీ పెంచాలని,సీసీ కెమెరాలు ఏర్పాటు చేయాలని ప్రజలు సూచిస్తున్నారు.నార్పలలో భద్రతపై ప్రశ్నలు తలెత్తుతున్న ఈ ఘటనపై అధికారులు స్పందించి తక్షణ చర్యలు తీసుకుంటారా? లేక దొంగలు మరింత రెచ్చిపోతారా? అన్నది చూడాలి.

# 12 ఏళ్లకు దొరికిన ముద్దాయి



**ఏలూరు జిల్లా ఆగిరిపల్లి మండలం ఫిబ్రవరి 23 చట్టం ప్రతినిధి :** ఆగిరిపల్లి పోలీస్ స్టేషన్ పరిధి లో జరిగిన మర్డర్ కేసు లో గత 12 సంవ త్సరాలుగా పరారీలో ఉన్న ముద్దాయి నీ అరెస్ట్ చేసిన ఆగిరి పల్లి పోలీస్ స్టేషన్ ఎస్ఐ శు భ శేఖర్ గారు వారి యొక్క సిబ్బంది ఆగిరిపల్లి పోలీస్ స్టేషన్ పరిధి లో నమోదు అయిన క్రైమ్ నం. 20/2009, ఖ/o 302, 120(దీ) తీ/ష 34 ఖూజ మర్డర్ కేసులో-ూ-3 ముద్దాయి అయిన అలవాల బాబ్జీ ఏ బాబీ ను ఆగిరిపల్లి పోలీసు లు అరెస్ట్ చేశారు. సదరు ముద్దాయి అలవాల బాబ్జీ ఏ బాబీ, తండ్రి నర సింహామూర్తి, గుంటూరు జిల్లా, సగర కులానికి చెందినవాడు. ఈయన కేసులో బెయిల్ పై విడుదలై 2014 సంవత్సరం నుండి కోర్టు వాయిదా లకు హాజరుకాక పోవడంతో గౌరవ నీయులైన 15 వ అదనపు జిల్లా కోర్టు, నూజివీడు వారు నాన్-బెయిలబుల్ వారెంట్ జారీ చేశారు. అప్పటి నుండి ముద్దాయి పరారీలో ఉన్నాడు.ముద్దాయి 2009లో కేసు నమోదు సమయం లో ఆధార్ వంటి ధృవీకరణ పత్రాలు లేకపోవడంతో తన పేరు ముద్దు పేర్లతో నమోదు చేయిం చుకొని, తరువాత తన అసలు వివరాలను మారుస్తూ పరారీలో ఉన్నట్లు విచారణలో తేలింది.ఏలూరు జిల్లా ఎస్పీ శ్రీ ఖ. ప్రతాప్ శివ కిషోర్, ఖూా గారి ఆదేశాల మేరకు, ఖఎఎచీఎ ప్రసాద్ గారి పర్యవేక్షణలో, నూజివీడు రూరల్ ఇన్స్పెక్టర్ ఖ. రామ కృష్ణ గారు, ఆగిరిపల్లి ఎస్ఐ ఖ. శుభ శేఖర్ గారి ఆధ్వర్యంలో ప్రత్యేక బృందం ఏర్పాటుచేసి ముద్దాయి కోసం గుంటూరు పరిసర ప్రాంతాల్లో విస్తృతంగా గాలింపు చేపట్టారు.దర్యాప్తులో భాగంగా గుంటూరు సమీపం లోని దాసరిపాలెం గ్రామంలో అలవాల వెంకటేశ్వర్లు అనే పేరుతో నివసిస్తున్న వ్యక్తిపై అనుమానం వ్యక్తమైంది. పోలీసుల కదలికలను గమ నించిన అతను అక్కడి నుంచి ఇల్లు ఖాళీ చేసి వెళ్లిపోయినట్లు తెలిసింది. పోలీసులు నిరం తరం గాలింపు కొన సాగిస్తూ, ఈ రోజు గుంటూరు పట్టణంలోని పాత సుజాత కాన్వెంట్, శనివారపేట ప్రాంతంలో అలవాల వెంకటేశ్వర్లు పేరుతో సంచరిస్తున్న వ్యక్తిని అదుపులోకి తీసుకొని విచారించగా, అతడే అలవాల బాబ్జీ ఏ బాబీ ఏ వెంకటేశ్వరరావు ఏ వెంకటేశ్వర్లు అని నిర్ధారించారు.దాదాపు 12 సంవత్సరాలుగా పరారీలో ఉన్న ముద్దాయిని పట్టుకొన్న ఆగిరిపల్లి పోలీస్ ముద్దాయిని కోర్టులో హాజరుపరచి తదుపరి చట్టపరమైన చర్యలు చేపడతామని ఆగిరిపల్లి ఎస్ఐ గారు ఈ సందర్భంగా తెలియ చేసినారు

# రజక కుటుంబంపై దాడి చేసిన వారిని కఠినంగా శిక్షించాలి...

### రజక సంఘం మహబూబాబాద్ జిల్లా కార్యదర్శి పున్నం సారయ్య డిమాండ్.

**మహబూబాబాద్ జిల్లా తొర్రూరు, ఫిబ్రవరి 23 (చట్టం న్యూస్) :** నాగర్ కర్నూల్ మండలం కుమ్మెర మల్లన్న జాతరలో రజక కుటుంబంపై అమానుషంగా దాడి చేసి, రెండు నెలల పసికందు మృతికి కారణమైన అగ్రకుల అహంకారులను వెంటనే అరెస్టు చేసి కఠినంగా శిక్షించాలని రజక సంఘం మహబూబాబాద్ జిల్లా కార్యదర్శి పున్నం సారయ్య డిమాండ్ చేశారు.అమానుష దాడిని ఖండిస్తూ...

ఈ సందర్భంగా సారయ్య మాట్లాడుతూ...మల్లన్న దర్శనం కోసం వెళ్లిన చాకలి చంద్రకళ కుటుంబాన్ని అడ్డుకోవడం సభ్య సమాజం తలదించుకోవాల్సిన విషయమని మండిపడ్డారు. కులం పేరుతో దూషిస్తూ, ఆలయంలోకి ప్రవేశం లేకుండా అడ్డుకోవడమే కాకుండా, ఎదురు తిరిగినందుకు కుటుంబ సభ్యులపై విచక్షణారహితంగా దాడి చేయడం దుర్మార్గమని అన్నారు. ఈ దాడిలోనే రెండు నెలల పసికందు మరణించడం అత్యంత విషాదకరమని, దీనికి బాధ్యులైన వారిపై హత్య కేసు నమోదు చేయాలని ఆయన ప్రభుత్వాన్ని కోరారు.



# ప్రజా సంక్షేమమే ప్రభుత్వ ధ్యేయం

- కళ్యాణ లక్ష్మి చెక్కుల పంపిణీ చేసిన
- ఎమ్మెల్యే కుంభం అనిల్ కుమార్ రెడ్డి



**భూదాన్ పోచంపల్లి ; ఫిబ్రవరి 23 చట్టం ప్రతినిధి :** ప్రజా సంక్షేమమే లక్ష్యంగా రాష్ట్ర ప్రభుత్వం పనిచేస్తుందని ఎమ్మెల్యే కుంభం అనిల్ కుమార్ రెడ్డి అన్నారు . మండల పరిధిలోని దోతిగూడెం గ్రామంలో సబ్ స్టేషన్ ప్రారంభించి కమ్యూనిటీ భవనం శంకుస్థాపన , అంతమ్మ గూడెంలో సి ఎస్ ఆర్ నిధులతో ఫంక్షన్ హాల్ పనులను శంకుస్థాపన చేశారు . ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రజా సమస్యల పరిష్కారమే ధ్యేయంగా ప్రజాప్రతినిధులు పనిచేయాలన్నారు . ఇటీవల విజయ సాయి రసాయన పరిశ్రమలు జరిగిన ప్రదేశాన్ని సందర్శించి పరిశీలించారు . యాజమాన్యాలు భద్రత ప్రమాణాలు కచ్చితంగా పాటించాలని లేనిపక్షంలో చర్యలు తప్పవన్నారు . అనంతరం పట్టణ కేంద్రంలోని కళ్యాణ లక్ష్మి షాదీ ముబారక్ చెక్కుల పంపిణీ కార్యక్రమం జరిగింది . కార్యక్రమంలో తహసిల్దార్ శ్రీనివాస్ రెడ్డి , పురపాలిక చైర్ పర్సన్ తడక వెంకటేశ్వర్లు , వైస్ చైర్మన్ కొయ్యడ రజిని శ్రీనివాస్ గౌడ్ , సర్పంచులు యాట జంగయ్య , గుమ్మి జంగారెడ్డి , వివిధ శాఖల అధికారులు పాల్గొన్నారు .



# మున్సిపల్ చైర్ పర్సన్‌కు లింగాయత్ సంఘం తరుపున సన్మానం



**మహబూబాబాద్ జిల్లా మరిపెడ, ఫిబ్రవరి 22 ,చట్టం న్యూస్,:** మహబూబాబాద్ జిల్లా మరిపెడ నూతన మున్సిపల్ చైర్ పర్సన్ వీసారపు ప్రగతి శ్రీపాల్ రెడ్డి ని ఆయన నివాసంలో లింగాయత్ సంఘం తరపున శాలువాతో సత్కరించి శుభాకాంక్షలు తెలిపారు ఈ కార్యక్రమంలో వెన్నె సుధాకర్ , శ్రీశైలం , ఉమామహేశ్వర్ , సోమన్న,వెన్నె మహేష్, వెన్నె కరుణాకర్, పాల్గొన్నారు

# నివాళులు అర్పించిన గంట్ల గౌతమ్ రెడ్డి



**మహబూబాబాద్ జిల్లా మరిపెడ, ఫిబ్రవరి 22, చట్టం న్యూస్ :** మరిపెడ మున్సిపాలిటీ కేంద్రంలోని 12వ వార్డుకు చెందిన తమనబోయిన బక్కమ్మ ఇటీవల మరణించారన్న విషయం తెలుసుకున్న 12వ వార్డు కౌన్సిలర్ గంట్ల గౌతమ్ రెడ్డి వారి నివాసానికి వెళ్లి చిత్రపటానికి పూలమాల వేసి నివాళు లు అర్పించారు వారి కుటుంబ సభ్యులను పరామర్శించి ధైర్యం గా ఉండాలని అన్నారు వారి కుటుంబానికి 50 కేజీల బియ్యం మరియు 5 లీటర్ల వంట నూనె ఇవ్వడం జరిగింది ఈ కార్యక్రమంలో తమనబోయిన ఉమేష్, వంగవీటి భరత్, ఉడుగుల రాజు ,తమనబోయిన కృష్ణ, తదితరులు పాల్గొన్నారు

# వాట్సాప్ ద్వారా విద్యుత్ సేవలు

### సేవలను సులభంగా చేయాలన్న లక్ష్యం

### టీజీఎస్పీడీసీఎల్ సీఎండీ ముషారఫ్ ఫారూఖీ

హైదరాబాద్,ఫిబ్రవరి23 : దక్షిణ తెలంగాణ విద్యుత్ పంపిణీ సంస్థ(టీజీఎస్పీడీసీఎల్) వినియోగదారులకు మరింత సులభమైన సేవలు అందించేందుకు ఆధునిక సాంకేతిక పరిజ్ఞానాన్ని అందుబాటులోకి తెచ్చింది. విద్యుత్ సేవలను నేరుగా తమ మొబైల్ ఫోన్ ద్వారానే పొందేలా వాట్సాప్ చాట్ సేవలను ప్రారంభించినట్లు టీజీఎస్పీడీసీఎల్ సీఎండీ ముషారఫ్ ఫారూఖీ ఒక ప్రకటనలో తెలిపారు. విద్యుత్ వినియోగదారులు తమ వాట్సాప్‌లో 8712441912 నంబర్‌ను సేవ్ చేసుకుని హాయ్ అని మెసేజ్ పంపడం ద్వారా ఫిర్యాదుల నమోదు, బిల్లింగ్ వివరాలు, విద్యుత్ సరఫరా స్థితి, సమాచారం వంటి వివిధ సేవలను సులభంగా పొందవచ్చని తెలిపారు. సైబర్ నేరగాళ్లు పంపించే మెసేజ్‌లకు వాట్సాప్ చాట్‌బాట్ చెక్ పెడుతుందన్నారు సీఎండీ. విద్యుత్ సరఫరాలో ఫిర్యాదుల నమోదుతో పాటు బిల్లు జారీచేయకపోయినా, ఆన్‌లైన్ బిల్లు చెల్లించాక ఆ సమాచారం అప్డేట్ కాకపోయినా, ట్రాన్స్‌ఫార్మర్ వద్ద ఏవైనా సమస్యలు తలెత్తినా, విద్యుత్ లైన్లకు చెట్లకొమ్మలు తగిలినా, విద్యుత్ స్తంభాలు ప్రమాదకరంగా ఉన్నా.. ఇలా పలురకాల ఫిర్యాదులను వాట్సాప్ చాట్ ద్వారా ఫిర్యాదు చేయవచ్చని ఆయన పేర్కొన్నారు.

# మాదకద్రవ్యాలపై యుద్ధం ప్రకటించాలి !

మాదక ద్రవ్యాలను అరికట్టేందుకు చేస్తున్న ప్రయత్నాలు ఫలించడం లేదు. అడపాదడపా గంజాయిని, ఇతర మత్తు పదార్థాలను పట్టుకుంటున్నా..అదేమంత పెద్ద మొత్తంలో కాదని తెలుస్తోంది. చాపకింద నీరులా ఈ వ్యాపారం మూడుపువ్వులు ఆరుకాయలుగా విస్తరిస్తోంది. రోజూ ఎక్కడోచోట దాడుల్లో మత్తు పదార్థాలను పట్టుకుంటూనే ఉన్నారు. అయినా రవాణా ఆగడం లేదు. దొరికిన వారిని ఎన్‌కౌంటర్ చేస్తే తప్ప రవాణా ఆగదేమో అన్న ఆందోళన కలుగుతోంది. నిరుద్యోగులు దీనిని ఓ ఉపాధిగా ఎంచుకోవడం వల్లనే రవాణా సులభంగా మారింది. దీనికితోడు దీంతో డబ్బులు కూడా బాగా రావడంతో యువత దీనిని ఉపాధిగా ఎంచుకుని ఈ ఉచ్చులో దిగుతున్నారు. దీనికి ప్రభుత్వం అనుసరిస్తున్న విధానాలు కూడా ఓ కారణంగా చూడాలి. కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు ఉమ్మడిగా పెద్ద ఎత్తున ఆపరేషన్ చేపట్టాల్సి ఉంది. యువత పెడమార్గం పట్టకుండా వారికి ఉపాధి చూపాలి. స్కూలుస్థాయిలోనే పిల్లల పట్ల తల్లిదండ్రులు జాగ్రత్త వహించాలి. కాలేజీల్లో నిఘా పెంచాలి. తెలుగు రాష్ట్రాల్లో ఈగిల్ టీమ్‌లు పనిచేస్తున్నా పరిస్థితికి అడ్డుకట్ట పడడం లేదు. ముఖ్యంగా యువత మత్తుకు అలవాటు పడి దుర్మర్గాలకు దిగుతున్నారు. మత్తు మనిషిలోని విచక్షణను హరించి వేస్తోంది. ఎలాంటి దారుణాలకు దారి తీస్తుందో చెప్పటానికి అన్నమయ్య జిల్లా మదనపల్లెలో ఇటీవల జరిగిన బాలిక హత్యాచార దుర్మార్గం ఓ హెచ్చరిక కావాలి. ఇదొక్కటే కాదు ఇలాంటి ఘటనలు చాలానే జరుగుతున్నాయి. మత్తులో ఓ మైనార్ బాలికను కొందరు సామూహిక అత్యాచచరం చేసారు. అభంశుభం తెలియని పసిపాపను చిదిమేసిన ఘటనలో కులవర్ధన్ అనే దుర్మార్గుడు ఆత్మహత్ చేసుకున్నా సంతోషించడానికి లేదు. నెల్లూరు నగరంలో పట్టపగలే అందరూ చూస్తుండగానే- పెంచలయ్య అనే ప్రజాకళాకారుడిని గంజాయి మూక పొట్టన పెట్టుకొంది. నిజామాబాద్ జిల్లాలో ఎక్సైజ్ శాఖ కానిస్టేబుల్ సౌమ్యను ఈ ఏడాది జనవరిలో మత్తు మాఫియా కారుతో గుద్ది, ప్రాణాలు బలిగొంది. గంజాయికి అలవాటు పడ్డ ముఠాలు హత్యలకు, అత్యాచారాలకు పాల్పడుతున్న దారుణ ఉదంతాలు తరచూ చూస్తూనే ఉన్నాం. ఏ పార్టీ అధికారంలో ఉంటే ఆ పార్టీకి అంటకాగుతూ ఈ ముఠాలు తమ దౌర్జన్యాలను చెలాయిస్తున్నాయి. రాష్ట్ర ప్రభుత్వం ఈ సమస్యను తీవ్రంగా పరిగణనలోకి తీసుకోవాలి. పైపై చర్యలతో ఈ గంజాయి సామ్రాజ్యం నశించిపోదని గ్రహించాలి. అన్ని రాజకీయ పార్టీలను కలుపుకొని ఒక ఖచ్చితమైన కార్యాచరణ రూపొందించాలి. గంజాయి, ఇతర మాదకద్రవ్యాలతో సంబంధం ఉన్న ముఠాలను పార్టీల నుంచి వెలివేయాలి. రాజకీయ దన్నుతో విర్రవీగుతున్న గంజాయి సామ్రాజ్యాన్ని సామాజికంగా, రాజకీయంగా అన్ని విధాలా ఒంటరిపాటు చేసినప్పుడే ? దాని నియంత్రణ, నిర్మూలన సాధ్యమవుతుంది. ఈ ఘటన యువతలో మార్పు తీసుకుని వస్తుందని అనుకోవడం భ్రమే అవుతుంది. తెలుగు రాష్ట్రాల్లో మాదక ద్రవ్యాల విచ్చలవిడి వినియోగం ఆందోళన కలిగించేలా ఉంది. దాని నియంత్రణకు,నిర్మూలనకు కట్టుదిట్టమైన చర్యలు తీసుకుంటున్నా లాభం లేకుండా పోతోంది. ఉభయ తెలుగు రాస్ట్రాల్లో వరుస ఘటనలు ఆందోళన కలిగిస్తున్నాయి. వరుసపెట్టి ఈ తరహా దారుణాలు జరుగు తున్నందుకు కఠిన చర్యలు తీసుకోకపోవటం క్షంతవ్యం కాదు. వరుసగా జరుగుతున్న చాలా నేరాల వెనుక మత్తు, మాదకద్రవ్యాలు విపరీతంగా పనిచేస్తున్నాయని ప్రభుత్వాలు గుర్తించాలి. నిందితుల ప్రాణాలు తీసేస్తోనో, జైల్లో వేస్తోనే, లేదా వారే తీసుకుంటేనో ఈ సమస్యకు పరిష్కారం దక్కదు. విస్తరిస్తున్న మాదక ద్రవ్యాల రవాణాను సవాల్‌గా తీసుకోవాలి. కూకటివేళ్లతో సహా పెకలించాలి. దానికి నిరంతరమైన, నిర్దిష్టమైన కార్యాచరణతో ప్రభుత్వాలు నిచేయాలి. అవసరమైతే ఉభయ తెలుగు రాష్ట్రాలు కలిసి పనిచేయాలి. ఇటీవల కాలంలో రాష్ట్రంలోనూ, దేశంలోనూ గంజాయి, ఇతర మాదక ద్రవ్యాల వినియోగం విపరీతంగా పెరిగిందనే వార్తలు ఆందోళన కలిగిస్తున్నాయి. పన్నెండేళ్ల వయసు పిల్లలు మొదలుకొని యువకుల వరకూ ఎక్కువగా వినియోగిస్తున్నట్టు అధికారిక లెక్కలు చెబుతున్నాయి. అందమైన భవిష్యత్తును నిర్మించుకోవాల్సిన విద్యార్థులు మత్తుకు బానిసలై జీవితాలను వ్యర్థం చేసుకుంటున్న ఉదంతాలు కోకొల్లలుగా ఉన్నాయి. మత్తు బానిసలను ఆ ఊబి నుంచి బయటకు తెచ్చే వైద్యానికే దేశంలో ఏటా రూ.15 వేల కోట్ల ఖర్చవుతుందని ఒక అంచనా. చికిత్సకు వెళ్లకుండానే కొందరు మత్తులనే కుప్పకూలి పోతున్నవారు దేశంలో 2003 - 2013 మధ్య పోలీసు తనిఖీల్లో రూ.40 వేల కోట్ల విలువైన 26 లక్షల కేజీల మాదకద్రవ్యాలు పట్టుబడితే- తరువాతి పదేళ్ల కాలంలో అంటే 2014 - 2025 మధ్య కాలంలో రూ.1.65 లక్షల కోట్ల విలువైన కోటి కిలోల మాదకద్రవ్యాలు దొరికాయి. విచ్చలవిడిగా పెరుగుతున్న మత్తు ద్రవ్యాల వినియోగానికి ఈ గణాంకాలు ఒక ఉదాహరణ. దొరికిన మాదకద్రవ్యాలే ఇంత పెద్దఎత్తున ఉంటే దేశమంతా విస్తరించి వినియోగమైనది ఎంత ఉంటుందో ఊహించవొచ్చు! మాదకద్రవ్య వినియోగం తొలుత సరదాగా మొదలై, ఉత్తేజం ఇస్తున్నట్టుగా అనిపించి, తరువాత మనిషి సర్వ శారీరక వ్యవస్థలనూ నిర్వీర్యం చేస్తుంది. మత్తుకు బానిసయ్యేలా మార్చేసి, విచక్షణను, వివేచనను చంపేస్తుంది. సామాజిక కట్టుబాట్లను, నాగరిక విలువలను కాలదన్ని, మనిషిని మృగంలా మార్చేస్తుంది. ఫలితంగా తీవ్రమైన నేరాలూ, దారుణాలు చోటు చేసుకుంటున్నాయి. మాదకద్రవ్యాల కారణంగా ఎన్నో కుటుంబాలు అస్తవ్యస్త మవుతున్నాయి. ముఖ్యంగా నైజీరియాన్స్ వీసా గడవువ ముగిసినా ఇక్డే తిష్టవేసి మత్తు వ్యాపారం చేస్తున్నారు. వీరిని ముందుగా గుర్తించాలి. మత్తు పదార్థాల రవాణను అరికట్టేందుకు ఆపరేషన్ చేపట్టాల్సిందే. ఇందుకోసం పెద్ద ఎత్తున బలగాలను వినియోగించాలి. యువతను కాపాడుకోవడానికి ఎంత కఠినమైన చర్యలకైనా వెనకాడరాదు.

## వైభవంగా సాగుతున్న యాదాద్రి బ్రహ్మోత్సవాలు

### గోవర్ధనగిరిధారిగా దర్శనమిచ్చిన నారసింహుడు



యాదగిరిగుట్ట,ఫిబ్రవరి23 : యాదగిరిగుట్ట శ్రీలక్ష్మీనరసింహ స్వామి ఆలయంలో వార్షిక బ్రహ్మోత్సవాలు వైభవంగా కొనసాగుతున్నాయి. ఈ ఉత్సవాల్లో భాగంగా ఆరో రోజైన సోమవారం యాదగిరీశుడిని 'గోవర్ధనగిరిధారి' అలంకరణలో భక్తులు సేవించారు. భక్తజన రక్షణెళి ధ్యేయంగా అవతారాలు దాల్చిన స్వామివారు ప్రకృతి బీభత్సం నుంచి కాపాడే భక్తజన బాంధవుడిగా శ్రీకృష్ణుడి లీలలను ప్రతిబింభించే అలంకరణలో దివ్య మనోహరంగా భక్తజనులకు దర్శనమిచ్చారు. తన చిటికెన వేలుతో గోవర్ధన పర్వతాన్ని ఎత్తిపట్టి గోపాలులను రక్షించిన మహిమలను అర్చకులు అలంకార విశిష్టతను భక్తులకు వివరించారు. భక్తుల గోవిందనామ స్మరణల మధ్య వైభవంగా ఊరేగించారు. ఉత్సవాలను ప్రధానార్చకులు కాండూరి వెంకటాచార్యులు, భట్టర్ సురేంద్రాచార్యులు, అర్చక బృందం, వేదపడింతులు, రుత్వికులు శాశ్రోక్తంగా నిర్వహించారు. సాయంత్రం స్వామివారు సింహ వాహనం పై ఊరేగుతూ భక్తులకు దర్శనం ఇవ్వనున్నారు. ఆలయ అనువంశిక ధర్మకర్త భాస్కరాయణీ నర్సింహమూర్తి, ఈవో భవాని శంకర్, డీఈవో దోర్భల భాస్కరశర్మ, ఏఈవోలు, పర్యవేక్షకులు, ఉద్యోగ, సిబ్బంది, భక్తులు ఈ ఉత్సవాల్లో పాల్గొన్నారు.

## ప్రారంభం అయిన ఇంటర్ పరీక్షలు

### కట్టుదిట్టమైన ఏర్పాట్లు చేసిన అధికారులు

తెనాలి,ఫిబ్రవరి23 : రాష్ట్ర వ్యాప్తంగా సోమవారం నుంచి ఇంటర్ పరీక్షలుప్రారంభం అయ్యాయి. ఇంటర్ బోర్డ్ కట్టుదిట్టమైన ఏర్పాట్లను పూర్తిచేసింది. ప్రశాంత వాతావరణం నడుమ అన్ని పరీక్ష కేంద్రాలు వద్ద పోలీస్ శాఖ బందోబస్తే కట్టుదిట్టం చేశారు. విద్యార్థులకు మౌలిక సదుపాయాలు కల్పనలో ఎటువంటి అలసత్వం వహించవద్దని అధికారులు ఆదేశాలు జారీచేశారు. స్థానిక కొత్తపేట వివేక కళాశాల పరీక్ష కేంద్రం వద్ద వన్ టౌన్ పోలీసులు బందోబస్తు ఏర్పాటుచేశారు. జిల్లా ఎస్పీ వకుల్ జిందాల్ ఆదేశాలతో తెనాలి డిఎస్పీ జనార్దనరావు పర్యవేక్షణలో తెనాలి డివిజన్ పరిధిలో ఎటువంటి అవాంఛనీయ సంఘటనలు తలెత్తకుండా బందోబస్తు ఏర్పాటుచేసినట్లు సిఐ మల్లికార్జునరావు తెలిపారు. ప్రశాంత వాతావరణంలో పరీక్షలు జరిగేవిధంగా భద్రత ఏర్పాట్లు పర్యవేక్షిస్తున్నట్లు ఆయన పేర్కొన్నారు.

# రఘురామకృష్ణరాజును కస్టోడియల్ టార్చర్ కేసు

## బీహార్‌లో ఐపీఎస్ అధికారి సునీల్ నాయక్ అరెస్ట్

అమరావతి,ఫిబ్రవరి23 రఘురామకృష్ణరాజును కస్టోడియల్ టార్చర్ కేసులో కీలక పరిణామం చోటుచేసుకుంది. వైఎస్ జగన్మోహన్ రెడ్డి నేతృత్వంలోని గత వైసీపీ ప్రభుత్వ హయాంలో అప్పటి ఎంపీ, ప్రస్తుత ఏపీ అసెంబ్లీ డిప్యూటీ స్పీకర్ రఘురామ కృష్ణరాజును కస్టడీలో వేధించినట్లు నమోదైన 'థర్డ్ డిగ్రీ' కేసులో కేసులో విచారణ ఎదుర్కొంటున్న ఐపీఎస్ అధికారి సునీల్ నాయక్ ను బీహార్‌లో ఏపీ పోలీసులు అరెస్టు చేశారు. బీహార్ కేడర్‌కు చెందిన సునీల్ నాయక్.. వైసీపీ హయాంలో డిప్యూటేషన్‌పై సీఐడీలో పనిచేశారు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత ఆయన బీహార్ వెళ్లిపోయారు. రఘురామ కస్టోడియల్ టార్చర్ కేసులో సునీల్ పాత్రపై ఫిర్యాదు చేయడంతో విచారణకు రావాలని ప్రకాశం జిల్లా ఎస్పీ దామోదర్ నోటీసులు జారీ చేసిన విషయం తెలిసిందే. ఈ కేసులో ప్రధాన నిందితుల్లో ఒకరైన సీనియర్ ఐపీఎస్ అధికారి సునీల్ నాయక్‌ను ఆంధ్రప్రదేశ్ పోలీసులు బిహార్‌లోని పట్నాలో అదుపులోకి తీసుకున్నారు. ప్రస్తుతం బిహార్ రాష్ట్రంలో ఐజీగా విధులు నిర్వహిస్తున్న సునీల్ నాయక్‌ను పట్టుకునేందుకు ఏపీ పోలీసుల బృందం పట్నా వెళ్ళింది. గత కొంతకాలంగా ఈ కేసులో విచారణకు హాజరుకావాలని పలుమార్లు నోటీసులు జారీ చేసినప్పటికీ, ఆయన స్పందించకపోవడంతో పోలీసులు ఈ కఠిన నిర్ణయం తీసుకున్నారు. వైసీపీ ప్రభుత్వ హయాంలో సునీల్ నాయక్ ఏపీ సీఐడీలో ఐజీగా డిప్యుటేషన్‌పై పనిచేశారు. 2021లో రాజద్రోహం కేసులో తనను అరెస్టు చేసిన సమయంలో, సీఐడీ కస్టడీలో ఉండగా తనపై సునీల్ నాయక్ నేతృత్వంలో థర్డ్ డిగ్రీ ప్రయోగించారని రఘురామకృష్ణరాజు ఫిర్యాదు చేశారు. తన కాళ్లపై తీవ్రంగా కొట్టడం, మానసికంగా వేధించడం వంటి చర్యల్లో సునీల్ నాయక్ కీలక పాత్ర పోషించారని రఘురామ తన ఫిర్యాదులో పేర్కొన్నారు. సునీల్ నాయక్‌ను అదుపులోకి తీసుకున్న వెంటనే ఏపీ పోలీసులు బిహార్ ప్రభుత్వానికి అధికారికంగా సమాచారం అందించారు. పట్నాలోని స్థానిక కోర్టులో ఆయనను హాజరుపరిచి ట్రాన్సిట్ వారెంట్ కోరారు. కోర్టు అనుమతి లభించడంతో ఇవాళ రాత్రికి ఆయనను విమానంలో లేదా రోడ్డు మార్గంలో గుంటూరుకు తీసుకువచ్చే అవకాశం ఉంది. ఈ అరెస్టుతో ఏపీలో రాజకీయ వాతావరణం ఒక్కసారిగా వేడెక్కింది. గత ప్రభుత్వ హయాంలో అత్యుత్సాహం ప్రదర్శించిన అధికారులపై కూటమి ప్రభుత్వం చర్యలు ప్రారంభించిందనే సంకేతాలు ఈ ఘటనతో స్పష్టమవుతున్నాయి. ఈ కేసులో మరికొందరు ఉన్నతాధికారులు కూడా విచారణను ఎదుర్కొనే అవకాశం ఉన్నట్లు కనిపిస్తోంది.

# హెరిటేజ్‌పై బొత్స అసత్య ప్రచారం

## ఇందాపూర్ డెయిరీతో ఏం సంబంధం

### మీడియాతో మంత్రి లోకేశ్

అమరావతి,ఫిబ్రవరి23 : రాష్ట్ర మాజీ మంత్రి బొత్స సత్యనారాయణ హెరిటేజ్‌పై ఫేక్ ప్రచారం చేశారని ఆంధ్రప్రదేశ్ విద్య, ఐటీ శాఖల మంత్రి నారా లోకేశ్ తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు. ఇందపూరు డెయిరీకి హెరిటేజ్‌కు ఎలాంటి సంబంధం లేదని స్పష్టం చేశారు. కానీ బొత్స ఇంద్రపూర్ డెయిరీకి.. హెరిటేజ్ కో కంపెనీ అని అసత్య ప్రచారం చేశారని ధ్వజమెత్తారు. అంత సీనియర్ నేతకు కో కంపెనీ అనే పదం ఉండదనే విషయం తెలియదా? అని నిలదీశారు. ఆయన ఇప్పటికైనా ఇందపూరు డెయిరీ హెరిటేజ్ కో ప్యాకర్ మాత్రమేనని తెలుసుకోవాలని చెప్పుకొచ్చారు. హెరిటేజ్ లిస్టెడ్ కంపెనీ అని.. తమ మీద సెబీకి కూడా జగన్ అండ్ కో ఫిర్యాదు చేశారని ప్రస్తావించారు. వాటికి సంబంధించి ఏమైనా ఆధారాలు ఇచ్చారా? నిరూపించారా.? అని వైసీపీ నేతలపై మంత్రి లోకేశ్ ప్రశ్నల వర్షం కురిపించారు. కిలో నెయ్యి రూ.360లకు ఎక్కడ దొరుకుతుందో నిరుపించాలని వైసీపీ నేతలకు సవాల్ విసిరారు. కిలో రూ.360లకు దొరుకుతుంటే అది కల్తీ నెయ్యి మాత్రమే అవుతుందని చెప్పుకొచ్చారు. మామూలుగా మార్కెట్‌లో కిలో నెయ్యి రూ.1000ల పైన ఉందని తెలిపారు. జగన్‌మోహన్ రెడ్డి హయాంలోని ఐదేళ్లలో సాక్షి, భారతి సిమెంట్స్‌కు ప్రభుత్వం నుంచి రూ.1000 కోట్ల లబ్ది పొందారని ఆరోపించారు. తాము ఇన్ని సంవత్సరాల్లో ఒక్క రూపాయి కూడా ప్రభుత్వం నుంచి తీసుకోలేదని స్పష్టం చేశారు. క్రికెట్ మ్యాచ్‌లో ఇండియా ఫైనల్స్‌కు వెళ్తే ఆ మ్యాచ్ చూసేందుకు తప్పనిసరిగా వెళ్తానని తెలిపారు. అవసరమైతే జగన్ రెడ్డి వస్తానంటే ఆయనకు కూడా తానే టికెట్ తీసుకుంటానన్నారు. శాసనమండలి సజావుగా జరగాలనుకున్న వైసీపీ సభ్యులు.. నాలుగు రోజులుగా ఎందుకు అడ్డుకుంటారని లోకేశ్ ప్రశ్నించారు. ఇప్పుడు బ్జడెట్ మీద చర్చ కావాలని శాసనమండలిలో వైసీపీ సభ్యులు అడగటం ఏమిటని నిలదీశారు. ఈ విషయం శాసనమండలి సమావేశాలను అడ్డుకున్నప్పుడు వైసీపీ సభ్యులకు తెలియదా? అని నిలదీశారు.

-------------

## మరోమారు భారీగా పెరిగిన బంగారం ధరలు

### అంతర్జాతీయ పరిణామాలే కారణమన్న నిర్మలా సీతరామన్



న్యూఢిల్లీ,ఫిబ్రవరి23 :దేశీయ మార్కెట్లో విలువైన లోహాల ధరలు చుక్కలు చూపిస్తున్నాయి. సోమవారం ట్రేడింగ్‌లో వెండి ధర ఏకంగా కిలోకు రూ.15,000 పైగా పెరగగా, బంగారం ధర 10 గ్రాములకు రూ.3,000 పైగా ఎగబాకింది. ఈ అసాధారణ పెరుగుదలపై కేంద్ర ఆర్థిక మంత్రి నిర్మలా సీతారామన్ స్పందిస్తూ.. పెట్టుబడిదారులకు మరియు వినియోగదారులకు కీలక విషయాలు వెల్లడించారు.. ఆర్బీఐ బోర్డు సమావేశం అనంతరం ఆర్థిక మంత్రి నిర్మలా సీతారామన్.. బంగారం, వెండి ధరల పెరుగుదల వెనుక ఉన్న అంతర్జాతీయ పరిణామాలను వివరించారు.. కేంద్ర బ్యాంకుల కొనుగోళ్లు.. గతంలో కేవలం భారత్, చైనా డిమాండ్ వల్లే ధరలు పెరిగేవి. కానీ, ఇప్పుడు ప్రపంచవ్యాప్తంగా ఉన్న అన్ని దేశాల కేంద్ర బ్యాంకులు భారీగా బంగారాన్ని కొనుగోలు చేసి నిల్వ చేసుకుంటున్నాయి. ఇదే ప్రస్తుత పెరుగుదలకు ప్రధాన కారణం అని వెల్లడించారు. అమెరికా-ఇరాన్ ఉద్రిక్తతలు మరియు అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ విధిస్తున్న కొత్త సుంకాల హెచ్చరికల వల్ల స్టాక్ మార్కెట్లు అస్థిరంగా ఉన్నాయి. దీంతో సురక్షితమైన పెట్టుబడిగా భావించే బంగారం వైపు ఇన్వెస్టర్లు మొగ్గు చూపుతున్నారని ఆర్థిక మంత్రి పేర్కొన్నారు..

భారత్ తన బంగారం అవసరాల కోసం పూర్తిగా దిగుమతులపైనే ఆధారపడుతోంది.. దేశీయంగా తగినంత వెలికితీత వనరులు లేకపోవడం కూడా ధరలపై ప్రభావం చూపుతోందని వెల్లడించారు ఆర్థిక మంత్రి నిర్మలా సీతారామన్.. తాజా ధరల వివారల్లోకి వెళ్తే.. 24 క్యారెట్ల 10 గ్రాముల బంగారం ధర రూ.3,724 పెరిగి.. రూ.1,60,600కి చేరింఇ.. ఇదే సమయంలో కిలో వెండి ధర రూ.15,931 పెరిగి రూ.2,68,875కు ఎగబాకింది.. అయితే, బంగారం, వెండి ధరల పెరుగుదలపై ఆందోళన చెందాల్సిన అవసరం లేదని.. ఆర్బీఐ పరిస్థితిని నిరంతరం పర్యవేక్షిస్తోంది. కొనుగోళ్లు ఇంకా పరిమితి దాటలేదు' అని పేర్కొన్నారు ఆర్థికశాఖ మంత్రి నిర్మలా సీతారామన్..

## పోలీస్ అధికారి సునీల్ కుమార్‌కు చుక్కెదురు

### సస్పెన్షన్ పొడిగించిన ప్రభుత్వం



అమరావతి,ఫిబ్రవరి23 : సీనియర్ ఐపీఎస్ అధికారి పి.వి. సునీల్‌కుమార్ సస్పెన్షన్‌ను ప్రభుత్వం జూన్ 30వరకూ పొడిగించింది. ఆయనపై ఉన్న కేసుల దృష్ట్యా పదవీవిరమణ వరకు ఇక విధుల్లో చేరే అవకాశం లేకుండా పోయింది. ఈ నెల 24 నాటికి ఆయన సస్పెన్షన్ గడువు ముగియనుంది. ఈ నేపథ్యంలో ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి విజయానంద్ నేతృత్వంలో 18న భేటీ అయిన రివ్యూ కమిటీ ఈ అంశంపై సుదీర్ఘంగా చర్చించింది. అగ్రిగోల్డ్ నిధుల దుర్వినియోగంతో పాటు అప్పటి వైసీపీ ఎంపీ, ప్రస్తుత డిప్యూటీ స్పీకర్ రఘురామ కృష్ణరాజును కస్టడీలో హింసించిన కేసుల్లో సునీల్ కుమార్‌పై విచారణ కొనసాగుతోంది. వీటితో పాటు ప్రభుత్వం తీసుకున్న క్రమశిక్షణ చర్యలపై సోషల్ మీడియా వేదికగా ఆయన వ్యాఖ్యలు చేసిన అంశంపై విచారణాధికారి తన నివేదికను సమర్పించాల్సి ఉంది.ప్రస్తుతం నాలుగు కేసుల్లో ఆయనపై విచారణ జరుగుతున్నందున సస్పెన్షన్ ఎత్తివేస్తే సాక్షులను ప్రభావితం చేసే అవకాశం ఉందని దర్యాప్తు అధికారులు ఇచ్చిన నివేదిక ఆధారంగా రివ్యూ కమిటీ అభిప్రాయం వ్యక్తం చేసింది. ఈ నేపథ్యంలో ఆయన సస్పెన్షన్‌ను తొలగించడం సబబు కాదని ప్రభుత్వానికి నివేదిక అందించింది. ఆయనపై ఉన్న క్రిమినల్ ప్రొసీడింగ్స్ పూర్తయ్యే వరకూ లేదా పదవీ విరమణల్లో ఏది ముందైతే అప్పటి వరకూ సస్పెన్షన్‌లో కొనసాగించాలని కమిటీ చేసిన సిఫారసులకు ప్రభుత్వం ఆమోదం తెలిపింది. ఈ మేరకు సీఎస్ ఆదివారం ఉత్తర్వులు జారీ చేశారు. ప్రభుత్వ అనుమతి లేకుండా నిబంధనలకు విరుద్ధంగా విదేశీ పర్యటనలకు వెళ్లారన్న ఆభియోగాలపై సునీల్‌కుమార్‌ను ప్రభుత్వం తొలుత 2025 మార్చి 2న సస్పెండ్ చేసింది. అప్పటి నుంచీ ఆయన సస్పెన్షన్‌లో ఉన్నారు.


## నేడు సేవాలాల్ మహారాజ్ 287వ జయంతి మహోత్సవమును విజయవంతం చేయండి.

**ఎల్ హెచ్ పి ఎస్ రాష్ట్ర ఉపాధ్యక్షుడు బోడ లక్ష్మణ్ నాయక్, జిల్లా అధ్యక్షుడు ఆంగోత్ చందులాల్ పిలుపు.**



**మహబూబాబాద్ జిల్లా ప్రతినిధి ఫిబ్రవరి 23 (చట్టం న్యూస్) :** నేడు సద్గురు సేవాలాల్ మహారాజ్ 287వ జయంతి మహబూబాబాద్ జిల్లాలోని సేవా ఘడ్ (అనంతద్రి గుట్ట) వద్ద జరిగే మహా జయంతి ఉత్సవాలను విజయవంతం చేయాలని లంబాడి హక్కుల పోరాట సమితి ఎల్ హెచ్ పి ఎస్ రాష్ట్ర ఉపాధ్యక్షుడు బోడ లక్ష్మణ్ నాయక్, మహబూబాబాద్ జిల్లా అధ్యక్షుడు ఆంగోత్ చందులాల్ పిలుపునిచ్చారు. ఈ సందర్భంగా బోడ లక్ష్మణ్ నాయక్, ఆంగోత్ చందులాల్ మాట్లాడుతూ.... మహబూబాబాద్ జిల్లా వ్యాప్తంగా ఉన్న బంజారా సోదరులు అంతా బంజారా ఆరాధ్య దైవం, సేవాలాల్ మహారాజ్ జయంతి ఉత్సవాలను జయప్రదం చేయాలని, ఈ యొక్క కార్యక్రమం దైవదర్శనముగా భావించి, సేవాలాల్ మహారాజ్ యొక్క జయంతిని రాష్ట్రవ్యాప్తంగా తెలిసే విధంగా అంగరంగ వైభవంగా నిర్వహించుకుందామని అన్నారు. జిల్లా వ్యాప్తంగా ఉన్న బంజారా సోదరులు, జిల్లా నలుమూలల నుండి కదిలి వచ్చి మంగళవారం ఉదయం 9:30 గంటలకు మహబూబాబాద్ పట్టణంలో ఉన్న ఎమ్మెల్యే క్యాంప్ ఆఫీస్ నుండి అనంతరం గుట్ట వద్ద ఉన్న సేవా ఘడ్ ఆలయానికి చేరుకుని సేవాలాల్ యొక్క జయంతి ఉత్సవాలను విజయవంతం చేయాలని అన్నారు.

## శోభనాచలుని ఆలయ హుండీ లెక్కింపు



**ఏలూరు జిల్లా ఆగిరిపల్లి మండలం ఫిబ్రవరి 23 చట్టం ప్రతినిధి :** శోభనగిరి బయం చేసి ఉన్న శ్రీవ్యాఘ్ర లక్ష్మీ నరసింహ స్వామి వారి ఆలయ హుండీ లెక్కింపు సోమవారం 23వ తేదీన జరిగింది.శ్రీ శోభనాచల వ్యాఘ్ర లక్ష్మీ నరసింహస్వామి వార్ల దేవస్థానం ది.23.02.2026 వ తేదీ సోమవారం స్వామివారి ఆలయంలో ని హుండీలు తనిఖీదారు వారు మరియు భక్తుల సమక్షంలో లెక్కింపు జరపగా.3,26,670/- రూ హుండీల ద్వారా వచ్చినవి . ఈ లెక్కింపు ఆలయ కార్య నిర్వహణ అధికారి సిహెచ్ సాయి పర్యవేక్షణలో జరిగినది.



## ప్రారంభమైన ఇంటర్ పరీక్షలు

### పరీక్షా కేంద్రాల్లో కలెక్టర్ ఆకస్మిక తనిఖీ

విజయనగరం,ఫిబ్రవరి23 : జిల్లావ్యాప్తంగా సోమవారం నుంచి ప్రారంభమైన ఇంటర్మీడియట్ పరీక్షలను జిల్లా కలెక్టర్ ఎస్. రాంసుందర్ రెడ్డి ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఇందులో భాగంగా కె.ఎల్. పురంలోని శ్రీ లక్ష్మీగణపతి జూనియర్ కళాశాలలోని పరీక్షా కేంద్రాన్ని ఆయన సందర్శించి, పరీక్షల నిర్వహణ తీరును క్షుణ్ణంగా పరిశీలించారు. విద్యార్థులు పరీక్ష రాస్తున్న గదులను సందర్శించి, వారికి కల్పించిన వసతులపై అధికారులను ఆరా తీశారు.ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ.. జిల్లాలో ఇంటర్ పరీక్షలను అత్యంత పకడ్బందీగా, పారదర్శకంగా నిర్వహించాలని ఆదేశించారు. మాల్ ప్రాక్టీస్‌కు ఎక్కడా అవకాశం లేకుండా కఠిన నిబంధనలు అమలు చేయాలని, నిఘా వ్యవస్థను పటిష్టం చేయాలని సూచించారు. విద్యార్థులు ఎటువంటి ఇబ్బందులు పడకుండా పరీక్షా కేంద్రాల్లో తాగునీరు, వెలుతురు, ఫ్యాన్లు వంటి కనీస సౌకర్యాలు ఉండేలా చూడాలని అధికారులకు దిశానిర్దేశర చేశారు. పరీక్షల నిర్వహణలో ఏవైనా లోపాలు లేకుండా చూడాలని ఆదేశించారు.

# తిరుమల లడ్డూ కల్తీ వ్యవహారం


- నేడు అసెంబ్లీలో వివరాలు ప్రవేశ పెడతాం
- వైకాపా దేవదేవుడిని రోడ్డుకు లాంగింది
- మీడియాతో చిట్చాట్‌లో మంత్రి లోకేశ్



**అమరావతి,ఫిబ్రవరి23 :** తిరుమలో కొలువుదీరిన దేవదేవుడికి జరిగిన మహాపచారం అసెంబ్లీ వేదికగా బయటపెడతామని ఆంధ్రప్రదేశ్ ఐటీ, విద్యా శాఖల మంత్రి నారా లోకేశ్ వెల్లడించారు. శ్రీవారి లడ్డూ కల్తీకి సంబంధించిన వాస్తవాలన్నీ మంగళవారం అసెంబ్లీలో పెడతామని తెలిపారు. సోమవారం అసెంబ్లీ లాబీలో నిర్వహించిన ఇష్టాగోష్ఠిలో మంత్రి లోకేశ్ మాట్లాడారు. సభకు రావడం సభ్యులుగా వారి బాధ్యత అంటూ వైసీపీ ఎమ్మెల్యేలకు ఆయన సూచించారు. అసెంబ్లీకి రమ్మని ఎవ్వరూ బొట్టుపెట్టి పిలవరంటూ ఈ సందర్భంగా వారికి చురకలంటించారు. దేవుడిని సైతం వైసీపీ రోడ్డు మీదకు తీసుకురావడం బాధాకరమన్నారు. దేవుడి ఫొటోలతో చట్టసభల్లో ర్యాలీలు చేయడం అభ్యంతరకరమని లోకేశ్ వ్యాఖ్యానించారు. జగన్ ప్రభుత్వ హయాంలో తిరుమల శ్రీవారి లడ్డూ తయారీలో కల్తీ నెయ్యి వినియోగించినట్లు ఆరోపణ వెల్లువెత్తాయి. దీనిపై కూటమి ప్రభుత్వం ప్రత్యేక దర్యాప్తు సంస్థ(సిట్)ను ఏర్పాటు చేసింది. ఈ నివేదికను ఇటీవల ప్రభుత్వానికి అందజేసింది సిట్. అయితే ఈ వ్యవహారంలో తమ తప్పేమీ లేదంటూ వైసీపీ నేతలు వ్యాఖ్యలు చేస్తున్నారు. అంతేకాకుండా.. కూటమి ప్రభుత్వం తమపై అసత్య ప్రచారం చేస్తోందంటూ వైసీపీ నేతలు తీవ్రంగా స్పందిస్తున్నారు. అసెంబ్లీ లాబీలో మీడియా ప్రతినిధులు అడిగిన ప్రశ్నలకు లోకేశ్ తనదైన శైలిలో సమాధానమిచ్చారు. తిరుమల శ్రీవారి లడ్డూ కల్తీకి సంబంధించిన వాస్తవాలను అసెంబ్లీలో మంగళవారం ప్రవేశపెడతామని మంత్రి నారా లోకేశ్ తెలిపారు. దేవదేవుడికి జరిగిన మహాపచారం అసెంబ్లీ వేదికగానే బయటపెడతామన్నారు. అసెంబ్లీకి రమ్మని ఎవరూ బొట్టుపెట్టి పిలవరని వైకాపా ఎమ్మెల్యేలను ఉద్దేశించి ఎద్దేవా చేశారు. సభకు రావటం సభ్యులుగా వారి బాధ్యత అని గుర్తుచేశారు. దేవుడిని కూడా వైకాపా నేతలు రోడ్డు మీదకు తీసుకురావవడం బాధాకరమని ఆగ్రహం వ్యక్తం చేశారు. దేవుడి ఫొటోలతో చట్టసభల్లో ర్యాలీలు ఆక్షేపణీయమన్నారు.

# సామాజిక సమానత్వం అనే లక్ష్యం కోసం కృషి

- వెనకబడిన వర్గాలకు ప్రాధాన్యం కల్పించేలా చర్యలు
- సూపర్ సిక్స్ పథకాలు సూపర్ హిట్ చేశాం
- ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనార్టీ వర్గాల కోసం ఎక్కువ కేటాయింపులు
- కల్తీపాల మృతుల కుటుంబాలకు పదిలక్షల ఎక్స్‌గ్రేషియా
- అసెంబ్లీలో సిఎం చంద్రబాబు ప్రకటన



**అమరావతి,ఫిబ్రవరి23 :** సామాజిక సమానత్వం అనే లక్ష్యం కోసం ఎన్డీయే కూటమి ప్రభుత్వం పనిచేస్తోందని ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు వ్యాఖ్యానించారు. రాజకీయంగా కూడా వెనకబడిన వర్గాలకు ప్రాధాన్యం కల్పించేలా చర్యలు తీసుకుంటున్నామని స్పష్టం చేశారు. అసెంబ్లీలో సోమవారం సంక్షేమ బ్జడెట్ కేటాయింపులపై చర్చించారు. సంక్షేమం విషయంలో సూపర్ సిక్స్ పథకాలు సూపర్ హిట్ చేశామని ఉద్ఘాటించారు. ఆటో కార్మికులు, మత్స్యకారులు, చేనేతలకు కూడా మేలు చేశామని తెలిపారు. నిత్యావసర సరకులు కూడా సక్రమంగా అందించేలా సాంకేతికత సాయం తీసుకున్నామని చంద్రబాబు పేర్కొన్నారు. ఆర్థికంగా ఇబ్బందులు ఉన్నా ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనార్టీ వర్గాల కోసం ఎక్కువ కేటాయింపులు చేశామని చెప్పుకొచ్చారు. బడ్జెట్ కేటాయింపులు అమలు చేసేందుకు చిత్తశుద్ధితో కృషి చేస్తామని వివరించారు. స్వర్ణాంధ్ర - 2047 విజన్‌లో భాగంగా తలసరి ఆదాయం రూ.3 లక్షల నుంచి రూ.54 లక్షలకు పెంచడానికి చర్యలు తీసుకుంటున్నామని తెలిపారు. భావితరాల అభివృద్ధిపై ప్రత్యేకంగా దృష్టి సారించామన్నారు. అంగన్‌వాడీ నుంచి స్కూళ్లు, కాలేజీల వరకూ మంచి విద్య, వైద్యం అందించేలా చర్యలు తీసుకున్నామని వెల్లడించారు. పేద వర్గాల ఆదాయం పెంచేందుకు తీసుకోవాల్సిన చర్యలపై దృష్టి సారించామని సీఎం చెప్పారు. పీ4 ద్వారా ఆర్థిక అసమానతలు తొలగించటానికి చర్యలు తీసుకుంటున్నామని చంద్రబాబు తెలిపారు. 10 లక్షల బంగారు కుటుంబాలను లక్షమంది మార్గదర్శకులు దత్తత తీసుకున్నారని వివరించారు. 'నిరంతరం పర్యవేక్షిస్తేనే ఏ కార్యక్రమమైనా ఫలితాలనిస్తుంది. అట్టడుగున ఉన్న పేదవర్గాలనూ ఆదుకునేలా పీ4 ప్రణాళికలు ఉన్నాయి. పూటగడవని పేదవారిని ఎలా పైకి తీసుకురావాలో అందరూ ఆలోచించాలి. 2047 నాటికి వికసిత్ భారత్ లక్ష్యాన్ని ప్రధాన మంత్రి నరేంద్ర మోదీ నిర్దేశిరచారు. ఈ లక్ష్యాన్ని సాధించాలంటే పేదరికం ఉండరాదు. 2024 ఎన్నికల్లో ఏకపక్షంగా కూటమికి 94 శాతం విజయం కట్టబెట్టారు. బీసీలకు 33 శాతం రిజర్వేషన్లు కల్పించేందుకు కమిషన్ వేశాం. స్థానిక సంస్థల ఎన్నికలు వచ్చే సమయానికి రిజర్వేషన్లు కల్పించేలా చర్యలు తీసుకుంటున్నాం' అని ముఖ్యమంత్రి పేర్కొన్నారు. బీసీ జాబితాలోని కొన్ని వర్గాలను ఎస్సీ, ఎస్టీల్లో చేర్చాలనే డిమాండ్లను కూడా పరిశీలిస్తున్నామని చంద్రబాబు తెలిపారు. 'ఎస్సీ వర్గీకరణ తెచ్చి.. ఆ దామాషా ప్రకారం రిజర్వేషన్లు కల్పించిన ఘనత ఎన్డీఏ ప్రభుత్వానికి దక్కింది. గిరిజనుల కోసం తెచ్చిన జీఓఎంఎస్ నంబర్-3ని సుప్రీంకోర్టు కొట్టివేసింది. ఈ విషయంపై ఏం చేయాలో గిరిజన సంఘాల నుంచి అభిప్రాయలు సేకరించి ముందుకెళ్తాం. మైనార్టీ వర్గాలకు కూటమి ప్రభుత్వం రక్షణ కల్పించిందని సీఎం చెప్పారు. రాజమహేంద్రవరం లోని చౌడేశ్వరి నగర్, స్వరూప్ నగర్‌లో స్థానికులు అస్వస్థతకు గురైన ఘటనపై ఏపీ సీఎం చంద్రబాబు అసెంబ్లీలో ప్రకటన చేశారు. ఈ ఘటన చాలా బాధాకరమన్నారు. లాలాచెరువు ప్రాంతంలో నలుగురు చనిపోయారని.. ఎనిమిది మంది ఆస్పత్రిలో చికిత్స పొందుతున్నారని చెప్పారు. వారిలో ఇద్దరి పరిస్థితి విషమంగా ఉందని పేర్కొన్నారు. మృతుల కుటుంబాలకు ప్రభుత్వం తరఫున రూ.10 లక్షల చొప్పున ఆర్థిక సాయం అందిస్తామన్నారు. వరలక్ష్మి డెయిరీకి చెందిన కల్తీ పాల వల్లే పలువురు అస్వస్థతకు గురైనట్లు ప్రాథమికంగా నిర్ధారణ అయిందని పేర్కొన్నారు. సెక్షన్ 194 కింద బాధ్యులపై కేసు నమోదు చేశామన్నారు.

--------------

# ఎల్ అండ్ టి నుంచి మెట్రో రైలు పూర్తి స్వాధీనం

- మెట్రో విస్తరణకు తొలగనున్న అడ్డంకులు
- స్వాధీన ప్రక్రియ పర్యవేక్షణకు భట్టి ఆధ్వర్యంలో ఉపసంఘం
- మార్చి 31లోగా మెట్రో స్వాధీన ప్రక్రియ పూర్తికి నిర్ణయం
- డైరెక్టర్ ఆఫ్ సెకండరీ హెల్త్‌గా వైద్యవిధాన పరిషత్
- ఖమ్మం జిల్లాలో టిటిడి నిర్మాణాలకు 20 ఎకరాలు
- మహబూబాబాద్ జిల్లా గుమ్మడూరులో జేఎన్‌టీయూకు 70 ఎకరాలు
- అన్ని జిల్లా కేంద్రాల్లో కాంగ్రెస్ కార్యాలయాలకు భూ కేటాయింపులు
- మార్చి 16 నుంచి 30 వరకు అసెంబ్లీ సమావేశాలు
- తెలంగాణ కేబినేట్ కీలక నిర్ణయాలు



**హైదరాబాద్,ఫిబ్రవరి23 :** హైదరాబాద్ మెట్రో రైలును ఎల్ అండ్ టీ నుంచి పూర్తిగా స్వాధీనం చేసుకోవాలని తెలంగాణ క్యాబినెట్ నిర్ణయించింది. ఇప్పటికే దీనిపై ప్రకటన విడుదల చేసిన రాష్ట్ర ప్రభుత్వం.. స్వాధీనం చేసుకునే పక్రియను పర్యవేక్షించడానికి మంత్రి వర్గ ఉపసంఘాన్ని నియమించింది. ఉపముఖ్యమంత్రి భట్టి విక్రమార్క నేతృత్వంలోని ఈ కమిటీలో.. మంత్రులు ఉత్తమ్‌కుమార్‌రెడ్డి, శ్రీధర్‌బాబు, జూపల్లి కృష్ణారావు సభ్యులుగా ఉంటారు.. ఇకపోతే మార్చి 16 నుంచి తెలంగాణ అసెంబ్లీ బడ్జెట్ సమావేశాలు జరుగనున్నాయి. 30 వరకు ఈ సమావేశాలు జరుగుతాయి. తొలిరోజు ఉభయ సభలను ఉద్దేశించిన గవర్నర్ ప్రసంగం ఉంటుంది. 20న బడ్జెట్ ప్రవే శ పెడతారు. దీనికి కేబినేట్ ఆమోదం తెలిపింది. ఇకపోతే మెట్రోకు సంబంధించ గత ఏడాది సూత్రప్రాయంగా జరిగిన ఒప్పందంలో రూ.2 వేల కోట్ల ఈక్విటీని ఏకమొత్తంగా ఎల్‌అండ్‌టీకి చెల్లించేలా.. రూ.13 వేల కోట్ల రుణాలను ప్రభుత్వం బదలాయించుకునేలా అవగాహనకొచ్చిన సంగతి తెలిసిందే. ఆ తర్వాతే స్వాధీన పక్రియ మొదలైంది. మెట్రో ఆస్తులు, వాటి విలువను ఐడీబీఐ క్యాపిటల్.. రైళ్లు, ట్రాక్‌లు, సిగ్నలింగ్ వ్యవస్థ వంటి సాంకేతిక అంశాలపై డీఎంఆర్‌సీ మదింపు చేసి ప్రాథమిక నివేదికలిచ్చాయి. ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి అధ్యక్షతన సోమవారం క్యాబినెట్ సమావేశం జరిగింది. ఈ సమావేశంలో పలు కీలక అంశాలపై మంత్రులతో సీఎం చర్చించారు. హైదరాబాద్ మెట్రోపై తెలంగాణ క్యాబినెట్ కీలక నిర్ణయం తీసుకుంది. ప్రస్తుతం హైదరాబాద్ మెట్రోని నిర్వహిస్తున్న ఎల్‌అండ్‌టీ నుంచి పూర్తిగా ప్రభుత్వాధీనంలోకి తీసుకునేందుకు క్యాబినెట్ ఆమోదం తెలిపింది. ఈ నిర్ణయం ప్రకారం మార్చి 31వ తేదీలోపు మెట్రోను పూర్తిగా స్వాధీనం చేసుకునేలా ప్రభుత్వం చర్యలు చేపట్టనుంది. ఈ టేకోవర్ మొత్తం విలువ సుమారు రూ.15,000 కోట్లుగా అంచనా వేసింది. ఇందులో మెట్రోపై ఉన్న అప్పులు రూ.13,000 కోట్లు కాగా, ఎల్ అండ్‌టీ సంస్థ ఈక్విటీ వాటా రూ.2,000 కోట్లుగా ఉంది. మెట్రో రెండో దశ విస్తరణకు కేంద్ర ప్రభుత్వం అనుమతి ఇవ్వాలంటే మొదటి దశ పూర్తిగా ప్రభుత్వ ఆధీనంలో ఉండాలని కేంద్ర ప్రభుత్వం షరతు విధించింది. ఈ నేపథ్యంలోనే మెట్రోను ప్రభుత్వ ఆధీనంలోకి తీసుకునే నిర్ణయం తీసుకున్నట్లు తెలుస్తోంది. ఈ నిర్ణయంతో హైదరాబాద్ మెట్రో విస్తరణకు మార్గం సుగమం కానుంది. నగరంలో రవాణా సౌకర్యాలు మరింత మెరుగుపడే అవకాశం ఉంది. ప్రభుత్వ ఆధీనంలోకి మెట్రో వచ్చిన తర్వాత.. మెట్రో విస్తరణ వేగవంతం అవుతుంది. ప్రయాణికులకు మరిన్ని సౌకర్యాలు కల్పించే అవకాశం ఉంటుంది. రవాణా వ్యవస్థపై ప్రభుత్వానికి పూర్తి నియంత్రణ ఉంటుంది. భవిష్యత్ ప్రాజెక్టులకు కేంద్ర సహాయం పొందడం సులభం అవుతుంది. ఇది నగర అభివృద్ధికి కీలక నిర్ణయంగా భావిస్తోంది. ఇకపోతే ఈ సమావేశంలో రాష్ట్ర పురోగతికి సంబంధించి పలు సంచలన నిర్ణయాలు తీసుకున్నారు. వైద్య విధాన పరిషత్‌లో మార్పులు , భూ కేటాయింపులపై కేబినెట్ ముద్ర వేసింది. రాష్ట్రంలోని వైద్య రంగంలో కీలక సంస్కరణలకు శ్రీకారం చుట్టారు. 'తెలంగాణ వైద్య విధాన పరిషత్' పేరును ఇకపై 'డైరెక్టరేట్ ఆఫ్ సెకండరీ హెల్త్'గా మారుస్తూ కేబినెట్ ఆమోదం తెలిపింది. ఈ మార్పుతో పాటు, ఇప్పటివరకు పరిషత్ పరిధిలో ఉన్న ఉద్యోగులను పూర్తిస్థాయిలో ప్రభుత్వ ఉద్యోగులు గా పరిగణించాలని నిర్ణయించారు. దీనివల్ల వేలమంది వైద్య సిబ్బందికి లబ్ధి చేకూరనుంది. రాజకీయ పార్టీల బలోపేతానికి సంబంధించి కూడా కేబినెట్ నిర్ణయం తీసుకుంది. రాష్ట్రంలోని ప్రతి జిల్లా కేంద్రంలో కాంగ్రెస్ పార్టీ కార్యాలయాల నిర్మాణానికి భూమిని కేటాయించేందుకు మంత్రివర్గం ఆమోదం తెలిపింది.మరికొన్ని కీలక భూ కేటాయింపులపై కూడా కేబినెట్ స్పష్టతనిచ్చింది. ఖమ్మం జిల్లాలో టీటీడీ ఆలయ నిర్మాణం లేదా ఇతర ఆధ్యాత్మిక సేవల కోసం 20 ఎకరాల భూమిని కేటాయించారు. మహబూబాబాద్ జిల్లా గుమ్మడూరు లో కొత్తగా జేఎన్‌టీయూ ఇంజనీరింగ్ కాలేజీ నిర్మాణానికి గాను 70 ఎకరాల భారీ కేటాయింపుకు కేబినెట్ గ్రీన్ సిగ్నల్ ఇచ్చింది. పరిపాలనా సౌలభ్యం కోసం , రాష్ట్ర సర్వతోముఖాభివృద్ధి కోసం తీసుకున్న ఈ నిర్ణయాలు తక్షణమే అమలులోకి రానున్నాయి. స్వల్ప అనారోగ్యం కారణంగా మంత్రి తుమ్మల నాగేశ్వరరావు సమావేశానికి హాజరు కాలేదు. కేంద్ర ప్రభుత్వం నిర్దేశిరచిన జనగణనపై మంత్రిమండలి భేటీలో కీలక చర్చ జరిగింది. ఈ చర్చలో జనగణన వివరాలను తెలంగాణ ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి కె. రామకృష్ణారావు వెల్లడించారు. రెండు దశల్లో జనగణన పక్రియ 2027 ఫిబ్రవరిలో రెండో దశ ప్రారంభం కానుంది. జనగణన కోసం రాష్ట్ర ప్రభుత్వం చేస్తున్న ఏర్పాట్లపై మంత్రివర్గంలో చర్చించారు. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి అధ్యక్షతన సచివాలయంలో జరిగిన రాష్ట్ర మంత్రివర్గ సమావేశంలో తెలంగాణలో కేంద్ర ప్రభుత్వం నిర్దేశిరచిన జన గణన పక్రియను చేపట్టేందుకు ప్రభుత్వం కీలక ఆమోదం తెలిపింది. ఈ భారీ కార్యక్రమాన్ని రాష్ట్రంలో అత్యంత పారదర్శకంగా, సమర్థవంతంగా నిర్వహించేందుకు ప్రభుత్వం సర్వసన్నద్ధమవుతోంది. ఈ సమావేశంలో ముఖ్యంగా నిర్ణీత షెడ్యూల్ ప్రకారం జరగాల్సిన తొలి విడత ఇండ్ల గణన అంశంపై సుదీర్ఘంగా చర్చించారు. రాష్ట్ర చీఫ్ సెక్రెటరీ రామకృష్ణారావు ఈ పక్రియకు సంబంధించిన ఏర్పాట్లను కేబినెట్‌కు వివరిస్తూ, మే 11వ తేదీన ఈ గణనను ప్రారంభించి జూన్ 9వ తేదీ వరకు పూర్తి చేసేలా ప్రణాళికలు సిద్ధం చేసినట్లు తెలిపారు. ఈ హౌజ్ లిస్టింగ్ పక్రియ కోసం కేంద్ర ప్రభుత్వం ప్రత్యేకంగా నిర్దేశిరచిన 34 ప్రశ్నలతో కూడిన నమూనా పత్రాన్ని ప్రభుత్వం వినియోగించనుంది. క్షేత్రస్థాయిలో ప్రతి ఇంటిని సందర్శించి వివరాలు సేకరించేందుకు సుమారు 84 వేల మంది ఎన్యుమ రేటర్లను, వారికి దిశానిర్దేశర చేసేందుకు నోడల్ ఆఫీసర్లను కలిపి మొత్తం 89 వేల మంది ప్రభుత్వ ఉద్యోగులను ఈ విధుల్లో భాగస్వాములను చేయనున్నారు. తొలి దశ విజయవంతంగా ముగిసిన తర్వాత, అసలైన రెండో దశ జన గణన పక్రియను వచ్చే ఏడాది అంటే 2027 ఫిబ్రవరిలో చేపట్టాలని మంత్రివర్గం నిర్ణయించింది. ప్రజల సామాజిక, ఆర్థిక స్థితిగతుల అంచనాకు ఈ గణన ఎంతో కీలకం కానున్న నేపథ్యంలో, ఎలాంటి లోపాలు లేకుండా ఈ పక్రియను పూర్తి చేయాలని ముఖ్యమంత్రి అధికారులను ఆదేశించారు. రాష్ట్రంలో ఎన్యుమరేటర్లతో పాటు నోడల్ ఆఫీసర్లు మొత్తం 89 వేల మంది ఉద్యోగులు జనగణన పక్రియలో పాలుపంచుకుంటారని తెలిపారు.

## దిశ ఒన్ స్టాప్ కేంద్రం ను పరిశీలించిన న్యాయమూర్తి





**కర్నూలు, చట్టం న్యూస్ (23 ఫిబ్రవరి 2026):** జిల్లా న్యాయ సేవాధికార సంస్థ కార్యదర్శి బి. లీలా వెంకట శేషాద్రి ప్రభుత్వ జనరల్ హాస్పిటల్ నందు గల దిశ ఒన్ స్టాప్ కేంద్రం, మహిళాప్రాంగణం (శక్తి సదన్) ను తనిఖీ చేశారు. ఈ తనిఖీ సమయంలో కొంతమంది సిబ్బంది విధులకు ఆలస్యంగా హాజరవుతున్నట్టు గమనించి కచ్చితంగా సిబ్బంది అందరు ఆఫీసు సమయపాలన పాటించాలని ఆదేశించారు.కార్యాలయాలకు సంబందించిన రిజిస్టర్ లను పరిశీలించగా రిజిస్టర్లు సక్రమంగా లేవని గుర్తించారు. రిజిస్టర్లలో సంబంధిత అధికారుల సంతకాలు లేవని వాటి గురించి అక్కడ సిబ్బందిని ప్రశ్నించారు.సెంటర్లో చేరే వారి వివరాలు వారి రికార్డులను సక్రమంగా మెయింటైన్ చేయాలని అలాగే సంబంధిత అధికారుల సంతకాలు కచ్చితంగా తీసుకోవాలని అక్కడ సిబ్బందిని ఆదేశించారు. ఈ సదస్సులో అక్కడ ఉన్న నివాసితులకు లీగల్ సర్వీసెస్ ఆక్ట్ 1987 ద్వారా ఉచిత న్యాయ సహాయంను పొందుటకు అర్హులని తెలిపారు. వారి భోజన వసతి సదుపాయాలు గురించి అడిగి తెలుసుకున్నారు. ఏవైనా సమస్య వస్తే ఫ్రీ లీగల్ ఎయిడ్ టోల్ ఫ్రీ నెంబర్ 15100 కు కాల్ చేయవచ్చునని తెలిపారు.ఈ కార్యక్రమంలో సంబందిత అధికారులు, తదితరులు పాల్గొనారు.

## అమరజీవి కామ్రేడ్ ముంగి రమేష్ మరణం పార్టీకి తీరని లోటు

- సిపిఐ మద్దివంచ గ్రామ శాఖ ఆద్వర్యంలో ఘనంగా 9 వర్ధంతి
- సిపిఐ రాష్ట్ర సమితి సభ్యులు కట్టెభోయిన శ్రీనివాస్




**మహబూబాబాద్ జిల్లా ప్రతినిధి ఫిబ్రవరి 23,(చట్టం న్యూస్) :** సిపిఐ సీనియర్ నాయకులు మద్దివంచ మాజి శాఖ కార్యదర్శి కామ్రేడ్ ముంగి రమేష్ తమ్మిదోవ వర్ధంతి సందర్భంగా సిపిఐ మద్దివంచ శాఖ ఆద్వర్యంలో ఘనంగా నిర్వహించడం జరిగింది. తొలుత ఆయన స్మారక స్తూపానిక తోకల పుల్లయ్య, చిటాకుల రాములు పూల మాల వేసి నివాళులు అర్పించడం జరిగింది. అనంతరం స్తూపం వద్ద పొన్నం వెంకటేశ్వర్లు పతాకావిష్కరన చేశారు. ఈ వర్ధంతి కార్యక్రమంలో ముక్యతిదిగా సిపిఐ రాష్ట్ర సమితి సభ్యులు హాజరయ్యి నివాళులు అర్పించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ కామ్రేడ్ ముంగి రమేష్ ఈ ప్రాంతం అభివృద్ధి కోసం నీకు ఉద్యమాలు నిర్వహించారనీ ఉన్నారు. ఉమ్మడి రాంపురం పంచాయతీ అభివృద్ధి కార్యక్రమాల్లో ఆయన ముందుండేవారిని అన్నారు. ఆయన మరణం భారత కమ్యూనిస్టు పార్టీకి తీరని లోటని అన్నారు. పార్టీ బలోపేతం కోసం ఆయన చేసిన కృషి మరువలేనిదని అన్నారు. ఆయన కలలుగన్న సమ సమాజ స్థాపన కోసం మనం ముందుండి పోరాడినప్పుడే ఆయనకు మనం ఇచ్చే ఘన నివాళి అని అన్నారు. ఈ కార్యక్రమంలో సిపిఐ మండల కార్యదర్శి జంపాల వెంకన్న రాగం రమేష్ ధూపాటి జనార్ధన్, గూగులోత్ భీమ్లా,రాగం సత్యనారాయణ, రాగం రాము, పొన్నం సదా, ఇరుగు వెంకటేష్,దొడ్ల రాంబాబు సంఘం వినోద్,అనిల్ బైరి శ్రీను, కుటుంబ సభ్యులు ముంగి సాయి శరత్ తదితరులు పాల్గొన్నారు.

## తెలుగు ప్రతిభ పరీక్ష నిర్వహణ






**కొడిమ్యాల, ఫిబ్రవరి 23 (చట్టం) :** జగిత్యాల జిల్లా పరిధిలోని కొడిమ్యాల, మల్యాల, పెగడపల్లి మండలాల కాంప్లెక్స్ పరిధిలోని ప్రభుత్వ పాఠశాలల విద్యార్థులకు మొట్టమొదటిసారిగా తెలుగు ప్రతిభ పరీక్ష నిర్వహించారు. ఈ ప్రతిభా పరీక్షను సోమవారం మల్యాల మండల విద్యా వనరుల కేంద్రంలో నిర్వహించడం జరిగింది. ఈ కార్యక్రమానికి జిల్లా విద్యాధికారి కె.రాము హాజరై మాట్లాడుతూ..అన్ని సబ్జెక్టుల వారిగా టాలెంట్ టెస్ట్ లు నిర్వహించిన విధంగానే తెలుగు టాలెంట్ టెస్ట్ నిర్వహించడం అభినందనీయం అన్నారు. సీనియర్స్ విభాగంలో ప్రథమ స్థానంలో ఎన్.విక్కి సుద్దపల్లి, ద్వితీయ స్థానం జి.సాత్విక్ రెడ్డి నమిలికొండ, జూనియర్స్ విభాగంలో ప్రథమ స్థానం ఎల్.శ్లోక, రాంసాగర్, ద్వితీయ స్థానం పి.మోక్ష, సూరంపేటలు గెలుపొందగా విద్యాధికారులు విజేతలకు బహుమతులు ప్రదానం చేశారు. ఈ కార్యక్రమంలో మల్యాల, కొడిమ్యాల, పెగడపల్లి మండలాల మండల విద్యాధికారులు జయసింహరావు, అయిత శ్రీనివాస్, సులోచన, ఎస్ఆర్పీ మనోహరచారి, ఏఎంవో చంద్రశేఖర్ రెడ్డి, తెలుగు భాష ఉపాధ్యాయులు, విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.

చట్టం సాహితీ లోకం 95814 19999

## దేశభాషలందు తెలుగు లెస్స.....కాదు కాదు..!



తరతరాల కలలను
మోసిన వెలుగు భాష
పాటలో ప్రాణమై
పరవశించిన మధుర భాష

కథలో కన్నీళ్లను
నవ్వుల పువ్వులతో
రంగరించి రమ్యంగా
అల్లిన అల్లిక భాష

పద్యానికి ప్రాణమై
పరిమళించే సుగంధాల భాష
మనసు మూలల్లో మందులా
ఇంకిన రమ్యమైన భాష

గర్వానికి చిరునామా
అయిన గొప్ప భాష
అమ్మలా చేయి పట్టి లోపలే
నడిపే లాలన భాష

పదాల ఒంపుసొంపులు
వయ్యారాల భాష
కమ్మనైన భాష
నా తెలుగు భాష

ఆదికవి నన్నయ
ఉభయకవిమిత్రుడు తిక్కన
ప్రబంధ పరమేశ్వరుడు ఎర్రన
తీర్చిదిద్దిన తెలుగు భాష

పోతన కలంలో జాలువారిన
రసరమ్య సుందర భాష
శ్రీనాథుని ఘటం లో
పురివిప్పి ఆడిన తెలుగు భాష

అల్లసాని పెద్దన మనుచరిత్ర
తెనాలి రామలింగం వికటకవి
సినారె విశ్వంభర
అన్నమయ్య కీర్తనలు

గిడుగు వారి అడుగుల మడుగై
గురిజాడ వారి గురుతై
ఆరుద్ర కూనలమ్మై
శ్రీశ్రీ మాత్రాచంధస్సై

శ్రీకృష్ణ దేవరాయల ఆముక్తమాల్యద
ఇటాలియన్ ఆఫ్ ది ఈస్ట్
దేశభాషలందు తెలుగు లెస్స.....కాదు కాదు,
లోక భాషలందు లెస్స ....నా తెలుగు భాష

రచన:- గోకృప
గోపాలకృష్ణ పరిమి
S/o వేంకట నారాయణ పరిమి
టెక్సాస్ అమెరికా
కోదాడ
98484 32533.

చట్టం సాహితీ లోకం 95814 19999

## పేరుకే నవలోకం



మారలేదు మారదు ఈ లోకం
పేరుకే నవలోకం అన్న మాయమాట

క్రూరత్వం సచ్చు పడిందని అనుకోవద్దు
అది కుల మతాల గర్భగుహలో
నిశ్శబ్దంగా శ్వాస ఆడుతోంది

పెత్తందారుల పైత్య నాట్యం
విషపు కోరలు చాచి విర్రవీగే వికృత వేడుక

అది గుడి కావచ్చు బడి కావచ్చు లేదా గూడుల సమూహం కావచ్చుజాతరా కావచ్చు
పసికందు అయినా ముసలి అయినా బలికావడమే గమ్యం

కులమత అహంకార జ్వాలలు
ఉబ్బికి పొంగిన వేళ
మానవత్వం మరుగున పడుతుంది
దానవత్వం దళసరిగా బయల్పడుతుంది

క్రూరత్వం
మూర్ఖ మదిలో దాగి ఉన్న ఉన్మాదం
ఆ పొరలు చీల్చుకుని బయటకు పొంగే
అసలు రంగు అదే

ఎంత చదివినా ప్రయోజనం ఏమి
చెడు గుణ గణాల దండయాత్రలో
మనిషి నిలువెల్లా సున్నయే కదా

రచన....సయ్యద్ హయ్యూల్ హయ్యూమ్
చురకశ్రీ కావలి
నెల్లూరు జిల్లా

చట్టం సాహితీ లోకం 95814 19999

## ఉదయం
## కొక్కోరోకో మంటూ కోడి కూసింది..




అరాచక శక్తులకు అండగా నిలిచిన చీకటి సామ్రాజ్యం వెలవెల పోయింది.. సందడిగా రెక్కలు విప్పిన పక్షుల కిలకిలా రావంతో పృకృతి పరవశించింది..
చిరుగుల దుప్పటిని తోసేసి పేదవాడి గుడిసెలో..
జీవం లేని కళ్ళల్లో ఎండిన డొక్కల జీవితంలో..
అధ్భుతం జరగదని తెలిసి
ఆశల పల్లకిలో ఊరిస్తూ..
సూర్యుడు తన దారిన తాను సాగుతూ..
లేలెమ్మంటూ బతుకు బండిని ముందుకు తోసాడు..
దూరపు కొండలు నునుపని పరుగు పందెంలో..
ఓడడమే గానీ గెలిచి నిలిచింది ఎవరూ లేరనీ..
తప్పని పయనంలో ఉన్నట్టుండి వెతల మబ్బులు..
కమ్మిన జీవితంలో ఉరిమింది ఉరుము మెరిసింది మెరుపు..
జోరున కనులలో జడివాన మొదలైంది కష్టాల కడలిలో..
దారీ తెన్ను తెలియక చిక్కుకున్న అభాగ్యులకు..
పున్నమి వెన్నెల కురిపించి చంద్రుడు అండగా తీరం చేర్చాడు..!

గోవర్ధన్ ఆముదాలపల్లి

చట్టం సాహితీ లోకం 95814 19999

## యోగి వేమన తెలుగుభాష కు యుగపురుషుడువైతాళికుడు



కామి గానిదే మోక్షగామి కాలే డు, భోగి పరిపక్వతే యోగి అని వేదవాక్కు! పెద్దల మాట!

భువిలో వేమన పద్యం వినని వారు,వర్షంలోతడవనితెలుగు వారుశీదరని ప్రగాఢ నమ్మకం!

వేమన రాజ కుటుంబీకుడు! గొప్ప భోగవిలాసి! గొప్పహేతు వాది,సమాజంలో దురాచారా లను ఉతికి పారేసి ఆరేసిన సంఘ సంస్కర్త! నవ యుగ వైతాళికుడు!ప్రజాకవి! యోగి! విలాస పురుషుడు! కేవలం ఇదినీతిశతకమేనాలేదాసంఘ సంస్కరణల పాంచ జన్యమా!

1928 సం. రాళ్లపల్లి అనంత కృష్ణ శర్మ వేమన కవిత్వం పై దృష్టి వివిధకోణాల విభజన!
వేమన కవిత్వం కల్తీలేని పచ్చి పాలలాంటిది! గొప్పతర్కవిత ర్కసంఘర్షణసంపుటి!రాజభో గా లం, అ ధి కా ర ద ర్పం, వ్య స నా లకు,స్త్రీలోలత్వంలకుబానిస! అతని రెడ్డి రాజుల వంశం! ఆస్తులు ,అంతస్తులు, అతని పాదాక్రాంతంభోగవిలాసాలలో మత్తెక్కి, తేలియాడుతూన్న వ్యక్తి!అతని వదినగారిని,వేశ్య కోరిక పైబంగారు ఆభరణం అడుగడంతో,కఠిన పరిక్ష తొ బాహ్య సౌందర్యమైన అందం కంటే మనో సౌందర్యమైన జ్ఞానము చాలా గొప్పది అనే నగ్నసత్య దిగంబరతత్వాన్ని బోధించడం వంటి ఒకే ఒక సంఘటనతోదిగంబరయోగిగా మారడం, తెలుగుజాతి అదృష్టమేమో!అతని పద్యం సమాజపు కుళ్ళును కడిగేసే ప్రక్షాళన ద్రవం సర్జికల్ స్ట్రైక్!
అవి అర్ధంచేసుకొని ఆచరిం చి,తీరాలికానీ,మనఅభ్యుద యానికి దారిదీపాలు! తెలుగు భాషకు కట్టని కోటలు! మనిషి ని, వెతికి మేల్కొల్పిన, మహా ప్రజా కవి యోగి వేమన! ప్రతి పద్యము చివర పాదం విశ్వదాభిరామ వినురవేమ మకుటం! కొన్ని మచ్చుకి.

1.ఉప్పు కప్పురంబు ఒక్క పోలికనుండు చూడ చూడ రుచుల జాడ వేరు!
2.అల్పుడెపుడుపలుకు ఆడంబరముగాను! సజ్జనుండు పలుకుచల్లగాను!
3.ఇనుము విరిగినేని ఇనుమారు ముమ్మారు! కాచి అతకవచ్చు కమ్మరీడు! మనసు విరుగనేని మరి అంట నేర్చునా!
4.పుత్తడిగనవారింట పుండు బాధైన వాసుధలోనవాసికెక్కు
పేదవానిశీట పెళ్లయినఎర్గరు! 5.గర్వ మేలపడదు గడుసు మాటలేల! ఉన్ననాడు నిన్ను ఊరంత మెత్తురు! లేనినాడు నిన్ను లేవదీయరెవరు!
6.తప్పులెన్ను వారు తండోప తండంబు!
7.పట్టు పట్టరాదు పట్టి విడవరాదు! పట్టినేని
...

ఇటువంటి ఆణిముత్యాలు ఎన్నో ఎన్నెన్నో మరెన్నో!అం దుకే సి.పి.బ్రౌన్ లాంటి ఆంగ్ల విద్యావేత్త వేమన సాహిత్యాన్ని ప్రపంచానికి అన్ని భాషలలో అనువదించి అందజేశారు! తెలుగు భాషా తెలుగుజాతి బ్రతికి ఉన్నంత కాలం వేమన బ్రతికేఉంటాడు
యోగి వేమన దేవోభవ

డాక్టర్ ప్రాత రాజశేఖర్, ప్రభుత్వ విశ్రాంత గురుకుల ఉపాధ్యాయులు, చోడవరం.



చట్టం సాహితీ లోకం 95814 19999

## నాణేనికి రెండు వైపుల

నాణానికి ఉంటాయి , ఎప్పుడూ రెండువైపులు.
రహదారిలో కూడా సాధారణము కదా ఎత్తుపల్లములు.
జీవితంలో కూడా తప్పవు గెలుపు ఓటములు.
ఒక విషయంలో ఓటమి జీవితానికి ముగింపు కాదు.
మరల పోరాటం సాధ్యం చేస్తుంది, నీకు విజయము.
మానవునికి శోభను ఇచ్చు గుణము , మరల మరల ప్రయత్నము.
ఓటమి ఎదురైనప్పుడు కూర్చొని వేదన చెందడం వలదు.
ఒకవైపు మంచితనము ఉన్నప్పుడు, మరోవైపు చెడు కూడా.
ముసుగులో ఉన్న మనిషిని చూసి మోసపోకుము ఎప్పుడూ.
జీవితంలో జరిగే మంచి చెడులు సాధారణం. సమాంతరం కూడా.
సర్వశక్తులు కూడగట్టుకొని తిరిగి ప్రయత్నం చేయడమే, తగిన పని.
కృష్ణుడు అంతటి వాడు, జరాసంధుడి ధాటికి నీటిలో కట్టాడు , రక్షలతో మహా ద్వారక నగరము.
ఆయనకు తెలుసు భీముని చేతిలో కలదని జరాసంధుడి మరణము.
చరిత్రలో ఘోరమైన ఓటముల తర్వాతే దక్కింది, ఘనవిజయము.
ఒకనాడు సినిమాలలో హీరోగా పనికిరావని అనిపించుకున్న అమితాబ్,
ఈనాడు భారతదేశంలోనే కాక , ప్రపంచాన అత్యంత గొప్ప సినీ ధ్రువతార.
ఒకనాడు కేవలం రెండు సీట్లతో ఉన్న ఒక రాజకీయ పక్షము,
నేడు భారత జాతిని విజయాల దిశగా నడిపిస్తున్న పర్వము.
కృషి, దీక్ష, పట్టుదల విజయానికి మనము స్వయంగా వేసుకొనే రాచమార్గాలు.
కష్టాల కొలిమిలో బాగా కాలినప్పుడు మానవుడు ఒదిగిపోగలడు.
ఎటువంటి కఠిన పరిస్థితుల్లోనైనా , అదే మానవుడు ఇమిడిపోగలడు.
బంగారు సింహాసనం పై కూర్చున్న ధనవంతుడు ,తర్వాతి రోజులోనే చిప్పకూడు.
కాలం ఇంతే. సుఖంగా ఉన్నామని అనుకునే లోగానే , దుఃఖం రుచి చూపెడుతుంది.

రచన: ముక్కా సత్యనారాయణ



చట్టం సాహితీ లోకం 95814 19999

## కాలుష్య నాగు కాటేస్తోంది



పెరుగుతున్న ప్రజానీకంలో
విపరీతమైన వాహన కాలుష్యం
మనిషికో బైకాయె ఇంటికో కారాయె
క్రిక్కిసిన ట్రాఫిక్ వలన కాలుష్యం పెరిగిపోయె

వృక్షములు తరిగిపోయి ఇపుడు వాయు కాలుష్యమాయె
జనజీవన వాహినిలోపల
రోగములు అధికమాయె

భూతదయ మృగ్యమైపోయి
పక్షి, జంతు జాతి తక్కువాయె
నగర వలసలు పెరిగిపోయి
పట్టణాలు కలుషితమైపోయె

వాతావరణ పరిస్థితులు
సహజత్వం కోల్పోయెను
వేసవిలో సైతము వర్షాలు
విపరీతంగా కురియుటాయె

మానవ తప్పిదనములే
ఇందుకు కారణములాయె

మనిషి స్వార్థపూరిత చర్యలే
ప్రకృతి పాడగుటకు హేతువాయె


స్వార్థముతో ప్రపంచమంతా
సతమతమై సాగుతున్నది
సమాజిక దృక్పధం లేకుండా
జీవితాలు గడచుచున్నవి

కాలుష్య రహిత వాహనముల
అవశ్యకతను గుర్తించవలయు
విపరీత కాలుష్యము వలనను
వింత వింత రుగ్మతలు వచ్చెను

అక్కి నర్సింలు గౌడ్
విశ్రాంత ఉపాధ్యాయుడు
మల్లాపూర్ రంగారెడ్డి జిల్లా
కవి గాయకుడు

చట్టం సాహితీ లోకం 95814 19999

## రాత మరచి పోతున్న మనిషి



రాను రాను..మనిషి
అక్షరాలు రాయడం
మరచి పోతున్నాడు.
రాతలు ఒంకర పోతున్నాయి.

గతంలో.. అచ్చులు, హల్లులు
అందంగా రాయడమే..
విద్యార్థుల ప్రథమ కర్తవ్యం.
" ఓన మాల " తో మొదలు పెట్టి.

పరీక్షల్లో..అందమైన దస్తూరికి
అదనపు మార్కులు పడేవి.
గజి బిజి జవాబులు సక్రమంగా ఉన్నా
దిద్దే వారు సున్నాలు చుట్టేవారు.

అక్షరాలు సక్రమంగా రాయడానికి
కాపీ పుస్తకాలు.. ఉండేవి.
గుండ్రటి రాత రాసే విద్యార్థిని
గురువులు మెచ్చే వారు.

ఆధునిక అక్షర అభ్యాసం లో
అచ్చు తప్పులే కాక..
పదాల కూర్పు, నేర్పు
గతి తప్పింది..ఒంకర టింకరగా మారింది.

కమ్యూటర్ యుగంలో..
అక్షరాలు అటకెక్కాయి.
" కోడ్ " భాష కొండెక్కి కూచుంది.

పలకా బలపాలు ఆకాశ దీపాలయ్యాయి.

ఉద్యోగులు..మొదట వేలి ముద్రలతో
( ఫింగర్ ప్రింట్)..ఆపై " ఫేషియల్
రికగ్నేషన్ " తో..అటెండెన్స్ చేస్తుండటంతో
అక్షరాల అవసరం.. తగ్గింది.

రాత ఫైల్.. కాస్త కమ్యూటర్ ప్రింట్
గా మారడంతో.. ఆల్ఫా బెటికల్స్
బరువై..కరువై..కనుమరుగై పోయింది.
రిటైర్ అయ్యాక..ఫించను కోసం
బ్యాంకులకు వెళితే..తిరిగి
" చేవ్రాలు " అవసరమై..పేరు రాస్తే
సుడులు, కొమ్ములు కొండెక్కి..

"రిజక్ట్ " రిపోర్ట్ వస్తోంది.
యంత్రాల మధ్య, మర మనిషిగా
మారిన " మనిషి " తిరిగి
అక్షరాలను దిద్దాల్సిన అవసరం.. ఏర్పడింది.

విజయకుమార్ గడియా
బెంగుళూరు.

చట్టం సాహితీ లోకం 95814 19999

## భక్తి ముక్తి ఆరోగ్య ప్రదం ఉపవాసం



ఆరవై సంవత్సారల క్రితం
అనకాపల్లిలో అమ్మమ్మ చెప్పింది
ఆరోగ్యంగా ఉండాలంటే
ఉపవాస దీక్ష ఉండాలని
దేముని పూజ భక్తి శ్రద్ధలతో చేసి
మానసిక ప్రశాంతత పొంది
ఏకాగ్రత ధారణ పెరిగి శతమానం భవతి గా జీవించవచునని అన్నది.

వింతగా ఆనాడు చూసిన
ఆచార్యునిగా, శాస్త్రవేత్తగా నిజమని
ప్రశాంతత, జీర్ణప్రక్రియ రక్తప్రసరణ జరుగునని
ముఖ్యమైన ఏకాదశులు
మహాశివరాత్రి పర్వదినాలలో ఉంటు
ఈ మధ్యనే ఆరోగ్యానికి
దీర్ఘ ఆరోగ్య జీవితానికి
ఉపవాస దీక్ష మంచిదన్నది పాశ్చాత్య పరిశోధనల ద్వారా
భక్తి ముక్తి ఆరోగ్యప్రదం
ఏడు పదులు దాటిన వయస్సులో
అనుభవ పూర్వకంగా తెలిసింది. ..!!
........................

కవి మిత్ర, సాహిత్య రత్న
ఆచార్య అయ్యలసోమయాజుల ప్రసాద్
(పుష్యమి)
విశాఖ పట్నం

## ~::కరుణాకర కరుణజూపు శ్రీకరా

శరణాగతవత్సలా కరుణానిధి గదాధర
ఉరగశాయి గరుడగమన కరుణజూపరా

తాపసాంతకి తాటకాంత దశరథరామ
తాప సార్థాంగ్యహల్య తాప విరామ
పాపి శక్రజ పాపధ్వంస పావన రామ

ఆపదామపహర్త సర్వార్థదా శ్రీరామ

శుకవరద సకలలోక శుభంకర చూడరా
సకలవేద నిలయుడా జగదీశ్వర బ్రోవర
అకహర రఘురామ! అవనిజా మనోహర!
కాకుత్స్థ కులతిలక కరుణా పయోధివిర

దశరథరామయ్య నామమౌదల దలిచితే
దశవిధాల పాపతూలము దహనమౌనురా
నిశి సంసారాభ్రచయము నీడ్చుటకు

చట్టం సాహితీ లోకం 95814 19999

ప్రశమన నామానిల ప్రభంజనమె శరణ్యం


రచన:: శంకర్ జీ డబ్బికార్
ఊరు::ఇబ్రాహీంపట్నం రంగారెడ్డి
చరవాణి::9160297956



# పెళ్లి కోసం ఉదయ్‌పూర్‌కు విజయ్



టాలీవుడ్ క్రేజీ జంట విజయ్ దేవరకొండ– రష్మిక మందన్నా పేర్లు గత కొద్ది రోజులుగా నెట్టింట హాట్ టాపిక్‌గా మారుతున్నాయి. వీరిద్దరి మధ్య సమ్‌థింగ్ సమ్‌థింగ్ నడుస్తుందని ప్రచారం జరుగుతున్న వేళ ఎట్టకేలకు వధూవరులుగా పెళ్లిపీటలు ఎక్కబోతున్నారు. ప్రేమ, పెళ్లిపై అఫీషియల్ అనౌన్స్‌మెంట్ ఇచ్చిన తరువాత పెళ్లి వేడుకల సందడి మొదలైంది. ఈ నెల 26న వివాహం జరగనుండగా, వేడుక కోసం ఈ జంట రాజస్థాన్‌లోని ఉదయ్‌పూర్‌కు బయల్దేరింది. ఎయిర్‌పోర్ట్‌లో కనిపించిన వీరి వీడియో ప్రస్తుతం సోషల్ మీడియాలో వైరల్ అవుతోంది. విజయ్ వెంట ఆయన సోదరుడు ఆనంద్ దేవరకొండ ఉన్నారు. ఇప్పటికే ఉదయపూర్ ప్యాలెస్‌లో ఏర్పాట్లు జోరుగా సాగుతున్నాయి. కుటుంబ సభ్యులు, అత్యంత సన్నిహితుల సమక్షంలో ఈ వివాహం ఘనంగా నిర్వహించేందుకు ఏర్పాట్లు చేస్తున్నట్టు సమాచారం. గత కొంతకాలంగా వీరి ప్రేమ, పెళ్లిపై వార్తలు జోరందుకున్నాయి. సోషల్ మీడియాలో ఒకే పోస్ట్‌తో పెళ్లి విషయాన్ని అధికారికంగా ప్రకటించారు. అభిమానులు ప్రేమగా పిలిచే 'విరోష్' పేరునే తమ వివాహానికి శీర్షికగా పెట్టామని పేర్కొన్నారు. మీరు ప్రేమగా పెట్టిన పేరు 'విరోష్'. మీ అందరి ఆశీర్వాదాలతో జంటగా మీ ముందుకు వస్తున్నాం. 'ది వెడ్డింగ్ ఆఫ్ విరోష్'' అంటూ ఎమోషనల్‌గా రాసుకొచ్చారు. ఉదయపూర్‌లో పెళ్లి అనంతరం మార్చి 4న హైదరాబాద్‌లో రిసెప్షన్ ఏర్పాటు చేయనున్నారు. నగరంలోని ఓ లగ్జరీ హోటల్‌లో వేడుకకు ఏర్పాట్లు జరుగుతున్నాయి. టాలీవుడ్ టాప్ సెలబ్రిటీలు, పలువురు రాజకీయ ప్రముఖులు ఈ కార్యక్రమానికి హాజరుకానున్నారని సమాచారం. లఅభిమానులు ఎంతో కాలంగా ఎదురుచూస్తున్న ఈ కలల కపుల్ పెళ్లి వేడుక సోషల్ మీడియాలో మరింత సందడి చేయనుంది.




## ఓజి దర్శకుడితో నాని బ్లడీ రోమియో




'ఓజీ' ఫేమ్ సుజీత్ దర్శకత్వంలో నాని ఓ స్టైలిష్ యాక్షన్ డ్రామాకు శ్రీకారం చుట్టాడు. ఈ చిత్రానికి 'బ్లడీ రోమియో' అనే టైటిల్ ఖరారు చేసినట్లు ఇండస్ట్రీలో ప్రచారం జరుగుతోంది. నిహారిక ఎంటర్‌టైన్‌మెంట్ బ్యానర్‌పై రూపొందుతున్న ఈ మూవీ, సుజీత్ సినిమాటిక్ యూనివర్స్ లో భాగమని సమాచారం. ఈ కాంబినేషన్ ప్రకటించగానే అభిమానుల్లో భారీ ఎ÷–జగ్జైట్మెంట్ నెలకొంది. ఈ ప్రాజెక్ట్‌లో హీరోయిన్‌గా బాలీవుడ్ సెన్సేషన్ తృప్తి డిమ్రి పేరును పరిశీలిస్తున్నట్లు వార్తలు వినిపిస్తున్నాయి. ఇప్పటికే ఆమె సందీప్ రెడ్డి వంగా–ప్రభాస్ కాంబినేషన్‌లో తెరకెక్కుతున్న స్పిరిట్‌లో నటిస్తోంది. ఒకవేళ 'బ్లడీ రోమియో'లో కూడా ఆమె ఓకే అయితే, ఇది ఆమెకు రెండో తెలుగు సినిమా అవుతుంది. 'యానిమల్ ' చిత్రంతో నేషనల్ క్రష్‌గా గుర్తింపు తెచ్చుకున్న త్రిప్తి, నాని సరసన నటిస్తే ఆ ప్రాజెక్ట్‌కు మరింత క్రేజ్ రావడం ఖాయం అంటున్నారు సినీ విశ్లేషకులు. ఒకవైపు రా మాస్ యాక్షన్ ఎంటర్‌టైనర్, మరోవైపు స్టైలిష్ యాక్షన్ డ్రామా ఇలా రెండు విభిన్న జానర్లలో నాని తన నటనా పరిధిని విస్తరించుకుంటున్నాడు. కంటెంట్‌కు ప్రాధాన్యత ఇచ్చే హీరోగా పేరు తెచ్చుకున్న నాని, ఈ రెండు సినిమాలతో మరోసారి తన రేంజ్‌ను నిరూపించు కునేందుకు సిద్ధమవుతున్నాడు. మొత్తానికి 'ది ప్యారడైజ్' మరియు 'బ్లడీ రోమియో' ప్రాజెక్ట్‌లు నాని కెరీర్‌లో కీలక మైలురాళ్లుగా నిలవనున్నాయా అన్న ఆసక్తి అభిమానుల్లో నెలకొంది. అధికారిక ప్రకటనలు వెలువడే వరకు ఈ క్రేజీ కాంబినేషన్‌లపై ఊహాగానాలు కొనసాగుతూనే ఉన్నాయి.

# పవన్, నాగబాబు దంపతులకు ఆహ్వానం








అల్లు వారింట పెళ్లి పనులు ఫుల్ జోష్‌లో జరుగుతున్నాయి. ఒకవైపు పసుపు దంచే కార్యక్రమాలు.. మరోవైపు బ్యాచిలర్ పార్టీలతో కొన్ని రోజుల నుంచి శిరీష్–నయనికల ఫొటోలు సోషల్ మీడియాలో తెగ వైరల్ అవుతున్నాయి. తాజాగా ఏపీ డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్, ఎమ్మెల్సీ నాగబాబును పెళ్లికి ఆహ్వానించారు. సతీ సమేతంగా పవన్ కల్యాణ్, నాగబాబుల ఇళ్లకు వెళ్లిన అల్లు అరవింద్.. వారికి నూతన వస్త్రాలు అందించి పెళ్లికి పిలిచారు. మార్చి 6న అల్లు శిరీష్ –నయనిక ఒకటి కానున్నారు. ఈ వేడుకకు ఇప్పటికే చిరంజీవికి ఆహ్వానం అందిన విషయం తెలిసిందే. ఇటీవలే పసుపు దంచే కార్యక్రమం జరిగింది. ఆ ఫొటోలను అల్లు అర్జున్ సతీమణి స్నేహ తన ఇన్‌స్టాలో పంచుకున్నారు. హైదరాబాద్‌లోనే వీరి పెళ్లి జరగనున్నట్లు తెలుస్తోంది. కుటుంబసభ్యులు, అత్యంత సన్నిహితులు ఈ వేడుకకు హాజరవుతారని సమాచారం. ఇక ఇటీవలే దుబాయ్‌లో ఫ్రెండ్స్ సర్కిల్‌కు బ్యాచ్‌లర్ పార్టీ ఇచ్చారు. అక్కడి నుంచి వచ్చాక ఫిబ్రవరి 20న అల్లు అర్జున్ హైదరాబాద్‌లో కుటుంబ సభ్యులకు, టాలీవుడ్ నటీనటులకు పార్టీ ఏర్పాటు చేశారు. ఈ వేడుకలో రామ్ చరణ్ దంపతులతో పాటు శ్రీలీల, మృణాల్, ఫరియా అబ్దుల్లా మరికొందరు సందడి చేశారు.

# చట్టం చిత్రం

# ఆరా ఆఫ్ ఉస్తాద్ రెండో పాట విడుదల




పవర్ స్టార్ పవన్ కళ్యాణ్ గురించి దర్శకుడు హరీష్ శంకర్ చేసిన వ్యాఖ్యలు ప్రస్తుతం వైరల్‌గా మారాయి. పవన్ కళ్యాణ్ హీరోగా హరీష్ శంకర్ దర్శకత్వంలో రూపొందిన చిత్రం మార్చి 26న విడుదల కానుంది. ఈ చిత్రంలో శ్రీలీల, రాశీ ఖన్నా హీరోయిన్లుగా నటిస్తున్నారు. మైత్రి మూవీ మేకర్స్ నిర్మిస్తున్న ఈ సినిమాకు దేవి శ్రీ ప్రసాద్ సంగీతం అందిస్తున్నారు. ఇప్పటికే షూటింగ్ పూర్తి చేసుకున్న ఈ మూవీ ప్రమోషన్ కార్యక్రమాలు జోరుగా జరుపుకుంటుంది. ఇందులో భాగంగా 'ఆరా ఆఫ్ ఉస్తాద్' అనే రెండో పాటను విడుదల చేశారు. ఈ సందర్భంగా హరీష్ శంకర్ మాట్లాడుతూ ఆసక్తికర విషయాలు పంచుకున్నారు. పవన్ కళ్యాణ్ రెండు దశాబ్దాలుగా మెడపై చెయ్యి వేసుకునే మేనరిజాన్ని గుర్తు చేస్తూ, దానికి మాటల రూపం ఇవ్వాలనే ఆలోచనతోనే 'నేను మెడ ముట్టుకుంటే తొడ కొట్టినట్టే' అనే డైలాగ్ వచ్చిందన్నారు. ఈ హుక్ లైన్ చెప్పగానే డీఎస్పీ ఉత్సాహంగా స్పందించారని తెలిపారు. మాస్ హుక్ లైన్‌లో కూడా ఫిలాసఫీ చెప్పొచ్చని దేవిశ్రీ ప్రసాద్ తనకు కాంప్లిమెంట్ ఇచ్చారని చెప్పారు. ఈ పాటను రచయిత చంద్రబోస్ కేవలం రెండు రోజుల్లో ఎనిమిది గంటల్లో రాశారని వెల్లడించారు. ఇది కేవలం అభిమానంతో రాసిన పాట కాదు. పవన్ కళ్యాణ్ లైఫ్ స్టైల్, ఆయన జర్నీపై అవగాహనతో వచ్చిన పాట. ఆయన వ్యక్తిత్వం, కష్టపడే స్వభావం ఈ పాటలో ప్రతి లైన్‌లో కనిపిస్తుంది. సినిమాల్లో కానీ, రాజకీయాల్లో కానీ ఆయనకు విజయాలు రాత్రికి రాత్రే రాలేదు. ఆ ప్రయాణం మొత్తం ఈ పాటలో వినిపిస్తుంది' అని హరీష్ శంకర్ అన్నారు. అభిమానులు పవన్ కళ్యాణ్‌కు పాలాభిషేకం చేస్తారని, కానీ దేవిశ్రీ ప్రసాద్ ఈ పాటతో పాటాభిషేకం చేశారని, చంద్రబోస్ తన సిరాతో సిరాభిషేకం చేశారని ఆయన పేర్కొన్నారు. అయితే పవన్ కళ్యాణ్ డబ్బుకి ఏమాత్రం లొంగని వ్యక్తి అని హరీష్ శంకర్ స్పష్టం చేశారు. 'గబ్బర్ సింగ్' తర్వాత అనేక మంది నిర్మాతలు, కార్పొరేట్ సంస్థలు సినిమాలు, యాడ్స్ కోసం సంప్రదించారని తెలిపారు. 2012లోనే పాన్ ఇండియా అనే పదం లేకపోయినా, ఒక యాడ్ కోసం షారుఖ్ ఖాన్ తీసుకునేంత రెమ్యూనరేషన్‌ను పవన్ కళ్యాణ్‌కు ఆఫర్ చేశారని చెప్పారు. అయితే ఆరోగ్యానికి హానికరమైన లేదా చిన్నపిల్లలకు మంచిది కాని ఉత్పత్తులకు ప్రచారం చేయడం ఇష్టం లేక ఆయన కొన్ని కోట్ల రూపాయల యాడ్స్‌ను తిరస్కరించారని వెల్లడించారు. ఇక సినిమాలో సాంగ్స్, డాన్స్, డైలాగ్స్, ఎంటర్‌టైన్‌మెంట్, యాక్షన్, డ్రెస్సింగ్ స్టైల్, హెయిర్ స్టైల్ అన్నీ ఉంటాయి. 2 గంటల 35 నిమిషాల సినిమాలో దాదాపు 2 గంటలు పవన్ కళ్యాణ్‌ను తృప్తిగా చూస్తారు' అని హరీష్ శంకర్ నమ్మకం వ్యక్తం చేశారు.

# త్రివిక్రమ్-వెంకి కాంబోలో ఎకె 47




టాలీవుడ్‌లో రాబోతున్న ఫ్యామిలీ ఎంటర్‌టైనర్ 'ఆదర్శ కుటుంబం ఎకె 47' విక్టరీ వెంకటేశ్, మాటల మాంత్రికుడు త్రివిక్రమ్ శ్రీనివాస్ కాంబోలో వస్తున్న ఈ చిత్రం నుంచి ఇప్పటికే విడుదల చేసిన పోస్టర్లకు మంచి స్పందన వస్తోంది. ప్రస్తుతం షూటింగ్ దశలో ఉన్న ఈ ప్రాజెక్టుకు సంబంధించిన ఆసక్తికర అప్‌డేట్ బయటకు వచ్చింది. ఇప్పటివరకు 40 శాతం షూటింగ్ పూర్తవగా వెంకీ టీం దుబాయ్‌కు వెళ్లనుందట.

10 రోజులపాటు దుబాయ్‌లో సాగనున్న షెడ్యూల్‌లో కీలక సన్నివేశాలను ప్లాన్ చేసిందట త్రివిక్రమ్ టీం. దుబాయ్‌లో వచ్చే సీన్లు సినిమాను ఎలివేట్ చేసేలా రిచ్‌గా ఉండబోతున్నాయని ఇన్‌సైడ్ టాక్. అంతేకాదు ఈ మూవీలో పాపులర్ తమిళ కమెడియన్ యోగిబాబు కూడా నటిస్తున్నట్టు తెలుస్తోండగా.. మేకర్స్ నుంచి అధికారిక ప్రకటన రావాల్సి ఉంది. అన్నీ అనుకున్నట్టుగా కుదిరితే సినిమా షూటింగ్ జూన్ కల్లా పూర్తి కానుందని సమాచారం. ఇప్పటికే 'నువ్వు నాకు నచ్చావ్', 'మల్లీశ్వరి' వంటి హిట్ చిత్రాలకు రైటర్ హీరో కాంబోగా కలిసి పనిచేసిన త్రివిక్రమ్–వెంకీ ఇప్పుడు డైరెక్టర్ హీరోగా మొదటిసారి చేతులు కలపడంతో సినిమాపై క్యూరియాసిటీ పెరిగిపోతుంది. ఇటీవల విడుదలైన టైటిల్ అనౌన్స్‌మెంట్, ఫస్ట్ లుక్ పోస్టర్ ప్రేక్షకుల్లో ఆసక్తిని పెంచేస్తున్నాయి. ఈ సినిమాలో కేజీఎఫ్ ఫేం శ్రీనిధి శెట్టి హీరోయిన్‌గా నటిస్తుండగా, నారా రోహిత్ కీలక పాత్రలో కనిపించనున్నాడు. ఈ మూవీని హారికా అండ్ హాసిని క్రియేషన్స్ బ్యానర్‌పై ఎస్. రాధాకృష్ణ నిర్మిస్తున్నారు. ఫ్యామిలీ ఎంటర్‌టైనర్‌తోపాటు క్రైం ఎలిమెంట్స్‌తో ఈ సినిమా ఉండబోతుందని తెలుస్తోంది.

# టీమిండియా ఓటమికి ఆ రెండు తప్పిదాలే కారణం..



## టీమిండియాపై మాజీ ప్లేయర్ రవిచంద్రన్ అశ్విన్ ఫైర్

దక్షిణాఫ్రికాతో జరిగిన సూపర్ 8 పోరులో భారత్ 76 పరుగుల భారీ తేడాతో ఓడిపోయింది. ఈ ఓటమి భారత సెమీఫైనల్ అవకాశాలను సంక్లిష్టంగా మార్చడమే కాకుండా, జట్టు ఎంపిక, బ్యాటింగ్ క్రమంపై తీవ్ర విమర్శలకు దారితీసింది. అశ్విన్ తన విశ్లేషణలో ప్రధానంగా అక్షర్ పటేల్‌ను జట్టు నుండి తొలగించడం, రింకూ సింగ్‌ను 8వ నంబర్‌లో బ్యాటింగ్‌కు పంపడం అనేవి జట్టు సమతూకాన్ని దెబ్బతీశాయని పేర్కొన్నారు. జట్టు యాజమాన్యం మ్యాచ్-అప్‌ల పేరుతో అక్షర్ పటేల్‌ను పక్కన పెట్టి వాషింగ్టన్ సుందర్‌ను జట్టులోకి తీసుకోవడాన్ని అశ్విన్ తప్పుబట్టారు. ఐపీఎల్ వంటి సుదీర్ఘ టోర్నీలలో మ్యాచ్-అప్‌లు పని చేస్తాయని, కానీ ప్రపంచకప్ వంటి ఐసీసీ టోర్నీలలో జట్టు స్థిరత్వం చాలా ముఖ్యమని ఆయన అభిప్రాయపడ్డారు. టీ20 క్రికెట్‌లో అక్షర్ పటేల్ టీమ్ ఇండియాకు 'మోస్ట్ వాల్యూబుల్ ప్లేయర్'అని, గత ప్రపంచకప్‌లో కూడా దక్షిణాఫ్రికాపై ఒత్తిడిలో ఆయన అద్భుత ప్రదర్శన చేశారని అశ్విన్ గుర్తు చేశారు. సమతూకం దెబ్బతింది: అక్షర్ లేకపోవడం వల్ల మిడిల్ ఓవర్లలో జట్టుకు ఉండాల్సిన ఎడమచేతి వాటం బ్యాటింగ్ బలం తగ్గిందని, ఇది దక్షిణాఫ్రికా స్పిన్నర్లు ఆధిపత్యం చెలాయించేలా చేసిందని ఆయన విశ్లేషించారు. మరో ముఖ్యమైన తప్పిదం రింకూ సింగ్‌ను 8వ స్థానంలో బ్యాటింగ్‌కు పంపడం అని అశ్విన్ అన్నారు. ఫినిషర్‌గా పేరున్న రింకూకు తగినన్ని ఓవర్లు లభించకపోవడం వల్ల భారత బ్యాటింగ్ భారీ స్కోరును సాధించలేకపోయిందని లేదా లక్ష్య ఛేదనలో వెనుకబడిందని ఆయన పేర్కొన్నారు. బ్యాటింగ్ ఆర్డర్‌లో నిరంతరం మార్పులు చేయడం వల్ల ఆటగాళ్ళలో అభద్రతాభావం ఏర్పడుతుందని, అది వారి సహజ సిద్ధమైన ఆటను దెబ్బతీస్తుందని అశ్విన్ హెచ్చరించారు. బ్యాటర్ల టెక్నిక్ గురించి కూడా అశ్విన్ ఘాటుగా స్పందించారు. భారత బ్యాటర్లు స్పిన్‌ను ఎదుర్కోవడంలో ప్రపంచంలోనే అత్యంత బలహీనంగా తయారయ్యారని ఆయన వ్యాఖ్యానించారు. డిఫెన్స్ లేకపోవడం: భారత బ్యాటర్లు తమ డిఫెన్స్‌పై నమ్మకం ఉంచకుండా కేవలం భారీ షాట్లపైనే ఆధారపడుతున్నారని, ఇది తిరిగే పిచ్‌లపై ప్రమాదకరమని అన్నారు. దక్షిణాఫ్రికా స్పిన్నర్లు వికెట్లు తీస్తుంటే మన బ్యాటర్లు స్వీప్ లేదా రివర్స్ స్వీప్ షాట్లను ఆడలేకపోయారని, ఇది వారి సాంకేతిక లోపాలను ఎత్తిచూపుతోందని విమర్శించారు. మొత్తంగా, దక్షిణాఫ్రికా జట్టు సరైన ప్రణాళికలతో వచ్చి భారత్‌ను చిత్తు చేసిందని, టీమ్ ఇండియా మాత్రం వ్యూహాత్మక గందరగోళంతో ఓటమిని కొనితెచ్చుకుందని అశ్విన్ తన రివ్యూలో కుండబద్దలు కొట్టారు.

## అత్యధిక సార్లు డకౌట్ అయిన భారత ఆటగాళ్ల జాబితా



టీమిండియా డిఫెండింగ్ ఛాంపియన్‌గా టీ20 వరల్డ్ కప్ 2026 బరిలోకి దిగింది. అయితే ఈ ప్రపంచ కప్ లో టీమిండియా ఓపెనర్ అభిషేక్ శర్మ వరుసగా 3 మ్యాచులలో డకౌట్ అయ్యాడు. దక్షిణాఫ్రికాతో జరిగిన సూపర్ 8 మ్యాచులో మరో ఓపెనర్ ఇషాన్ కిషన్ డకౌట్ అయ్యాడు. అయితే టీ20ల్లో టాప్ బ్యాటర్లుగా అయినప్పటికీ అభిషేక్ శర్మ, సూర్యకుమార్ యాదవ్ సైతం ఐసీసీ ఇంటర్నేషనల్ క్రికెట్‌లో అత్యధిక డకౌట్లు అయిన బ్యాటర్ల జాబితాలో ఉన్నారు. ఇండియాకు చెందిన కొందరు దిగ్గజ బ్యాటర్ల పేరిట అత్యధిక 'డక్' (0 పరుగులకే అవుట్ కావడం) అయిన రికార్డులు ఉన్నాయి. ఈ జాబితాలో అందరికంటే ముందు టీమిండియా మాజీ కెప్టెన్ రోహిత్ శర్మ ఉన్నాడు. 2007 నుండి 2024 వరకు 159 టీ20 మ్యాచ్‌లు ఆడిన హిట్ మ్యాన్ రోహిత్, 12 సార్లు డకౌట్ అయ్యాడు. రోహిత్ 140 కంటే ఎక్కువ స్ట్రైక్ రేట్‌తో 4231 పరుగులు చేశాడు. అయితే, టీ20 వంటి ఫార్మాట్‌లో దూకుడుగా ఆడటం వల్ల ఓపెనర్లు త్వరగా అవుట్ అయ్యే అవకాశం ఎక్కువగా ఉంటుంది. ఈ విషయంలో రెండో స్థానంలో వికెట్ కీపర్ బ్యాటర్ సంజూ శాంసన్ ఉన్నాడు. శాంసన్ 2015 నుండి 2026 మధ్య ఆడిన 58 మ్యాచ్‌లలో 7 సార్లు ఖాతా తెరవకుండానే ఔటయ్యాడు. శాంసన్ 1100 పరుగులు చేయగా, అతడి స్ట్రైక్ రేట్ దాదాపు 149గా ఉంది. శాంసన్ సాధారణంగా డాషింగ్ ఇన్నింగ్స్ ఆడతాడు. కానీ త్వరగా వికెట్లు సమర్పించుకోవడం అతడికి మైనస్ పాయింట్. టీమిండియా మాజీ కెప్టెన్ విరాట్ కోహ్లీ కూడా ఈ జాబితాలో ఉన్నాడు. కోహ్లీ 2010 నుండి 2024 వరకు 125 టీ20 మ్యాచ్‌లలో 7 సార్లు ఖాతా తెరవకుండానే ఔటయ్యాడు. అయినప్పటికీ కోహ్లీ పేరిట 4,188 పరుగులు ఉన్నాయి. అతడి సగటు దాదాపు 49గా ఉంది. ఈ ఫార్మాట్‌లోనూ కోహ్లీ బెస్ట్ బ్యాటర్ గా కొనసాగాడు. ఇటీవల టీ20 వరల్డ్ కప్‌లో పేలవమైన ఫామ్‌తో ఇబ్బంది పడుతున్న అభిషేక్ శర్మ కూడా ఈ జాబితాలోకి వచ్చేశాడు. యువ ఓపెనర్ 2024 నుండి 2026 మధ్య ఆడిన 41 మ్యాచ్‌లలో 6 సార్లు డకౌట్ అయ్యాడు. అభిషేక్ స్ట్రైక్ రేట్ 190 కంటే ఎక్కువగా ఉండటం అతడి దూకుడు బ్యాటింగ్ శైలిని తెలుపుతుంది. ఈ వరల్డ్ కప్ లోనే 3 సార్లు అభిషేక్ ఖాతా తెరవకుండా వికెట్ కోల్పోయాడు. ఇండియా టీ20 కెప్టెన్ సూర్యకుమార్ యాదవ్ ఈ అవాంఛనీయ జాబితాలో చోటు దక్కించుకున్నాడు. సూర్య 2021 నుండి 2026 వరకు ఆడిన 108 మ్యాచ్‌లలో 6 సార్లు డకౌట్ అయ్యాడు. ఇటీవల వరుసగా డకౌట్లు, విఫలమైన సూర్య మళ్లీ పుంజుకున్నాడు. అయినప్పటికీ, సూర్యకుమార్ యాదవ్ 3192 పరుగులు చేశాడు. ఎన్నో మ్యాచ్‌లలో టీమిండియాను గెలిపించాడు.

..............

## చట్టం స్పోర్ట్స్

# టీమ్‌ఇండియా అత్యంత చెత్త ఓటములు ఇవే..



డిఫెండింగ్ ఛాంపియన్‌గా టీ20 వరల్డ్‌కప్ బరిలో దిగిన టీమ్‌ఇండియాకు సూపర్ 8 తొలి మ్యాచ్?లోనే షాక్ తగిలింది. సౌతాఫ్రికాతో జరిగిన ఈ మ్యాచ్?లో భారత్ ఘోర ఓటమి చవిచూసింది. తొలుత బంతితో, ఆ తర్వాత బ్యాటుతో పూర్తిగా విఫలమైన టీమ్‌ఇండియా కీలక పోరులో 76 పరుగుల తేడాతో ఓడి సెమీఫైనల్ అవకాశాలు సంక్లిష్టం చేసుకుంది. దీంతో తదుపరి రెండు మ్యాచ్?ల్లోనూ తప్పక నెగ్గాల్సిన పరిస్థితి ఏర్పడింది. ఈ టోర్నీలో గ్రూప్ దశలో ఓటమి లేకుండానే టీమ్‌ఇండియా సూపర్ 8కు దూసుకొచ్చింది. వరుసగా యూఎస్?ఏ, నమీబియా, పాకిస్థాన్, నెదర్లాండ్స్?పై విజయం సాధించింది. దీంతో ఇక్కడ కూడా భారత్ అదే ఫలితాలు రిపీట్ చేయాలని అభిమానులు భావించారు. కానీ, సూపర్ 8 మొదటి మ్యాచ్?లోనే గట్టి ఎదురుదెబ్బ తగలడంతో నిరాశ చెందారు. వరల్డ్? ఛాంపియన్ జట్టు ఘోర ఓటమిపాలవ్వడంతో ఆందోళన చెందుతున్నారు. ఇప్పటికైనా తప్పులు సరిదిద్దుకొని వరుస విజయాలు సాధించి సెమీస్?కు చేరాలని ఆశిస్తున్నారు. టీమ్ ఇండియా సూపర్ కమ్?బ్యాక్ ఇవ్వాలని కోరుకుంటున్నారు. అయితే గతంలోనూ టీ20 వరల్డ్?కప్?లో భారత్ భారీ పరాజయాలు మూటగట్టుకున్న సందర్భాలు ఉన్నాయి. ఆయా మ్యాచ్?ల్లో ఓటమిపాలై ఆ తర్వాత పుంజుకున్న సందర్భాలూ ఉన్నాయి. టీమ్‌ఇండియా 2016 టీ20 వరల్డ్?కప్?ను ఊహించని ఓటమితో ఆరంభించింది. ఆ ఎడిషన్?లో తొలి మ్యాచ్?లో న్యూజిలాండ్?ను భారత్ ఢీ కొట్టింది. తొలుత బౌలింగ్ చేసిన టీమ్‌ఇండియా కివీస్?ను 126-7 స్కోరుకే పరిమితం చేసింది. దీంతో భారత్ అలవోకగా గెలిచేస్తుందని ఫ్యాన్స్ అనుకున్నారు. కానీ, అనుకున్నట్లు ఛేదన జరగలేదు. స్వల్ప లక్ష్యాన్ని భారత్ అందుకోలేదు. 18.1 ఓవర్లలో కేవలం 79 పరుగులకే ఆలౌటై ఘోర ఓటమిని మూటగట్టుకుంది. ధోని (30), విరాట్ (23), అశ్విన్ (10) ముగ్గురే రెండంకెల స్కోర్ చేశారు. పొట్టి కప్పులో భారత్?కు ఇది అత్యంత ఘోర ఓటమి. అయితే ఆ తర్వాత టీమ్‌ఇండియా కమ్?బ్యాక్ ఇచ్చింది. అదిరే ఆటతో సెమీఫైనల్?కు దూసుకెళ్లింది. కానీ అక్కడ వెస్టిండీస్?తో ఓడింది. 2014 ఎడిషన్?లో భారత్ తమ మూడో మ్యాచ్ ఆస్ట్రేలియాతో ఆడింది. ఇందులో తొలుత బ్యాటింగ్ చేసిన భారత్ కష్టాలు పడుతూ 20 ఓవర్లలో 140-7 స్కోర్ చేసింది. ఇర్ఫాన్ (31), రైనా (26) టాప్ స్కోరర్లు. అయితే పిచ్ బ్యాటింగ్?కు కఠినంగా ఉందని అంతా భావించారు. కానీ, ఛేదనలో సీన్ రివర్స్ అయ్యింది. తొలుత పరుగులు చేసేందుకు టీమ్‌ఇండియా అష్టకష్టాలు పడ్డ అదే పిచ్?పై ఆసీస్ బ్యాటర్లు చెలరేగిపోయి ఆడడం గమనార్హం. ఒకే వికెట్ కోల్పోయి 14.5 ఓవర్లలోనే ఈ టార్గెట్?ను ఛేదించి గ్రాండ్ విక్టరీ కొట్టింది. 2022 ఎడిషన్?లో రోహిత్ శర్మ సారథ్యంలో టీమ్‌ఇండియా సెమీఫైనల్?లో అడుగుపెట్టింది. అక్కడ ఇంగ్లాండ్?ను ఢీ కొట్టింది. అయితే ఈ మ్యాచ్?లో మొదట బ్యాటింగ్ చేసిన భారత్ 20 ఓవర్లలో 168-6 స్కోర్ చేసింది. హార్దిక్ పాండ్య, విరాట్ కోహ్లీ చెరో హాఫ్ సెంచరీ సాధించారు. కానీ ఛేజింగ్?లో ఇంగ్లాండ్ జెట్ స్పీడ్?తో రెచ్చిపోయింది. ఒక్క వికెట్ కూడా కోల్పోకుండా 16 ఓవర్లలోనే ఇంగ్లాండ్ ఈ టార్గెట్?ను ఛేదించేసింది. ఓపెనర్లు బట్లర్ (80), అలెక్స్ హేల్స్ (86) చెలరేగి ఆడారు. వీళ్ల బ్యాటింగ్?కు టీమ్‌ఇండియా బౌలర్లు కళ్లెం వేయలేకపోయారు వన్?సైడ్?గా సాగిపోయిన ఈ మ్యాచ్?లో భారత్ అసలు పోటీ కూడా ఇవ్వలేకపోయింది. పొట్టి కప్పు హిస్టరీలో భారత్?కు ఇదే అత్యంత ఘోర ఓటమి అని చెప్పవచ్చు!ఐసీసీ టోర్నీల్లో పాకిస్థాన్?పై అప్పటిదాకా ఘనమైన రికార్డ్ ఉంది. 100శాతం విజయాలతో టీమ్‌ఇండియా ట్రాక్ రికార్డ్ ఘనంగా ఉంది. కానీ, 2021లో భారత్ తొలిసారి టీ20 వరల్డ్?కప్?లో పాక్?పై ఓటమి చవిచూసింది. దుబాయ్ వేదికగా జరిగిన ఈ మ్యాచ్?లో పాకిస్థాన్ 10 వికెట్ల తేడాతో ఘన విజయం సాధించింది. భారత్ 152 పరుగుల లక్ష్యాన్ని నిర్దేశించింది. అయితే ఈ టార్గెట్?ను పాక్ ఓపెనర్లు మహ్మద్ రిజ్వాన్ (79), బాబర్ అజామ్ (68) 17.5 ఓవర్లలోనే కొట్టేశారు. ఈ మ్యాచ్? ఓటమి టీమ్‌ఇండియా అభిమానులను తీవ్రంగా కలిచివేసింది. అలా 2021,2022 వరుస ఎడిషన్లలో పాక్, ఇంగ్లాండ్?పై భారత్ ఓటములు అభిమానులను బాధించాయి. కానీ ఆ తర్వాత పాక్?తో జరిగిన అన్ని ఐసీసీ ఈవెంట్లో (ప్రస్తుత వరల్డ్?కప్? సహా)నూ భారత్ ఘన విజయం సాధించింది.

# టీమిండియా జట్టులో కీలక మార్పులు?

## సౌతాఫ్రికా చేతిలో పరాజయంతో నిర్ణయం

టీ20 వరల్డ్ కప్ 2026లో భాగంగా అహ్మదాబాద్‌లో సౌతాఫ్రికా చేతిలో ఎదురైన ఘోర పరాజయం టీమిండియాను ఆలోచనలో పడేసింది. ఈ ఓటమి నేర్పిన పాఠాలతో కెప్టెన్ సూర్యకుమార్ యాదవ్, కోచ్ ఇప్పుడు జట్టులో కీలక మార్పులకు సిద్ధమవుతున్నారు. సూపర్-8లో భారత్ తన తదుపరి పోరులో జింబాబ్వేను ఎదుర్కోనుంది. ఈ మ్యాచ్ చెన్నైలోని ప్రతిష్టాత్మక ఎం.ఏ.చిదంబరం స్టేడియం (చెపాక్) వేదికగా జరగనుంది. చెన్నై పిచ్ స్వభావం దృష్ట్యా భారత ప్లేయింగ్ ఎలెవన్‌లో భారీ మార్పులు ఉండబోతున్నాయని సమాచారం. చెపాక్ స్టేడియం అంటేనే స్పిన్నర్ల స్వర్గధామం. ఇక్కడ బంతి బాగా టర్న్ అవుతుంది కాబట్టి, భారత్ ముగ్గురు స్పెషలిస్ట్ స్పిన్నర్లతో బరిలోకి దిగే అవకాశం ఉంది. గత మ్యాచ్‌లో దూరమైన స్టార్ ఆల్‌రౌండర్ అక్షర్ పటేల్ తిరిగి జట్టులోకి రావడం ఖాయంగా కనిపిస్తోంది. వాషింగ్టన్ సుందర్ స్థానంలో అక్షర్ జట్టులోకి వస్తే బ్యాటింగ్, బౌలింగ్ రెండింటిలోనూ బలం పెరుగుతుందని మేనేజ్మెంట్ భావిస్తోంది. అలాగే ప్రత్యర్థి బ్యాటర్లను తన మాయాజాలంతో తిప్పికొట్టేందుకు చైనామన్ బౌలర్ కుల్దీప్ యాదవ్ కూడా తుది జట్టులోకి వచ్చే అవకాశాలు పుష్కలంగా ఉన్నాయి. మరోవైపు, యువ ఓపెనర్ అభిషేక్ శర్మ ఫామ్ ఇప్పుడు జట్టుకు తలనొప్పిగా మారింది. ఈ వరల్డ్ కప్‌లో అతను వరుసగా విఫలమవుతుండటంతో, అతని స్థానంలో సంజూ శామ్సన్‌ను ఆడించాలనే డిమాండ్లు గట్టిగా వినిపిస్తున్నాయి. అయితే కీలకమైన మ్యాచ్ కావడంతో అనుభవం లేని ప్రయోగాలు చేయకుండా, అభిషేక్ శర్మపైనే మేనేజ్మెంట్ మరోసారి నమ్మకం ఉంచేలా కనిపిస్తోంది. వరుణ్ చక్రవర్తి, అర్ష్‌దీప్ సింగ్ తమ స్థానాలను నిలబెట్టుకోనుండగా, బౌలింగ్ విభాగంలో కుల్దీప్ లేదా సుందర్‌లలో ఒకరికి చోటు దక్కవచ్చు. జింబాబ్వేను తక్కువ అంచనా వేయడం భారత్‌కు ప్రాణసంకటమే. ఎందుకంటే గ్రూప్ దశలో ఆస్ట్రేలియా, శ్రీలంక వంటి దిగ్గజ జట్లకే చెమటలు పట్టించి సూపర్-8కు చేరిన ఘనత ఆ జట్టుది. ముఖ్యంగా వారి స్పిన్నర్లు ఈ టోర్నీలో అద్భుతంగా రాణిస్తున్నారు. ఈ నేపథ్యంలో చెన్నై పిచ్‌పై భారత్ ఎంతో జాగ్రత్తగా ఆడాల్సి ఉంటుంది. నెట్ రన్ రేట్ దెబ్బతినకుండా ఉండాలంటే, జింబాబ్వేపై భారీ విజయం సాధించడం సూర్య సేనకు అనివార్యం.

### జింబాబ్వే పై భారత్ ప్లేయింగ్ ఎలెవన్ (అంచనా) :

అభిషేక్ శర్మ, ఇషాన్ కిషన్, తిలక్ వర్మ, సూర్యకుమార్ యాదవ్ (కెప్టెన్), శివమ్ దూబే, హార్దిక్ పాండ్యా, అక్షర్ పటేల్, కుల్దీప్ యాదవ్ / వాషింగ్టన్ సుందర్, వరుణ్ చక్రవర్తి, అర్షదీప్ సింగ్, జస్ప్రీత్ బుమ్రా



Edited, Published and Owned by Baddala LaKshmi Narayana, and Printed at BADDAL Publications, #B.No.28/07, R.G.K. Apartments, Bellary Road, Kurnool - 518 003. A.P.
Editor Baddala Lakshmi Narayana, Redg. No. APTEL/2011/40367. chattamnews@gmail.com. baddalpublications@gmail.com. Cell: 916000 3999 / 4999 / 5999